# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

సంపుటి : 2 | సంచిక : 277 | శనివారం | 01 - 03 - 2025 | పేజీలు : 8 | వెల : 5.00 | www.telanganamuchatlu.in


## నల్లచెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు న్యూస్ :**



హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేడు కూకట్‌పల్లిలోని నల్లచెరువును సందర్శించారు. హైడ్రా ఆధ్వర్యంలో మొదటి విడతగా చేపట్టిన 6 చెరువుల అభివృద్ధిలో భాగంగా నేడు ఆయన ఇక్కడ పర్యటించారు. ముఖ్యంగా రేపటి తరాలకు చెరువులను, కుంటలను కాపాడి వారికి అందించడమే లక్ష్యంగా హైడ్రా ముందుకు వెళుతుందని ఆయన వెల్లడించారు. నగరంలో చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రస్తుతం నల్లచెరువులో జరుగుతున్న నీటి తొలగింపు అదేవిధంగా ఉడికతీత పనులపై అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెరువుకు సంబంధించి ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిహెచ్ఎంసి, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో చెరువుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు

# తిరుగుబాటు తప్పదు...!



- జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాదికే శిక్ష
- ఇప్పటికే పన్నుల వాటాలో తెలంగాణకు అన్యాయం
- బిహార్‌కు రూ.7.60, యూపీకి రూ.3 ఇస్తున్నారు
- మోదీ కుట్రను కచ్చితంగా తిప్పికొడతాం
- ఇతర భాషలను బలవంతంగా రుద్దితే ఊరుకోం
- విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంటు సీట్లను పెంచకుండా శిక్షించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అలా జరిగితే దక్షిణాది రాష్ట్రాల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. దక్షిణాది సీట్లు తగ్గవంటూ అమిత్ షా చెబుతున్నారని, పెంచబోమన్న లాజిక్ అందులో కనబడుతోందని వ్యాఖ్యానించారు. ఉత్తరాది బీమారు(బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, యూపీ) రాష్ట్రాలకు సీట్లు పెంచుకుని, శాశ్వతంగా అధికారంలో ఉండాలని బీజేపీ పన్నాగం పన్నిందని ఆరోపించారు. కేంద్రం సూచనలు పాటిస్తూ జనాభాను నియంత్రించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కుట్రను తప్పకుండా తిప్పికొడతామని ప్రకటించారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో రేవంత్ పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. డీలిమిటేషన్‌లో లోక్‌సభ సీట్లు తగ్గబోవని చెబుతున్న అమిత్‌షా దామాషా పద్ధతిలో ఎన్నిసీట్లు పెంచబోతున్నారో ఎందుకు చెప్పడం లేదని రేవంత్ ప్రశ్నించారు. లోక్‌సభ సీట్ల పెంపులో కేంద్ర ప్రభుత్వం అనుసరించే ప్రాతిపదిక ఏమిటని అడిగారు. ఇప్పుడున్న సీట్ల దామాషానా? జనాభా దామాషానా? చెప్పకుండా తగ్గవంటూ స్పష్టత లేని సమాధానం అమిత్‌షా ఎలా ఇస్తారన్నారు. నియోజకవర్గాల పునర్విభన ద్వారా బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి బీమారు రాష్ట్రాల సీట్లు పెంచుకుని, దక్షిణాది రాష్ట్రాల సీట్లు, ఓట్లతో పని లేకుండా శాశ్వతంగా అధికారంలో ఉండాలని బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఇది దేశంలో తీవ్రమైన సంక్షోభాన్ని సృష్టించబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో సీట్ల దామాషా ప్రకారం 17 సీట్లకు ఇంకా 9 సీట్లు కలిసి మొత్తం 26 సీట్లు రావాలన్నారు. సీట్ల దామాషా కాదంటే 1971 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని సీట్ల పెంపును ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. గత యాభై ఏళ్లలో దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను పాటించడంతో జనాభా బాగా తగ్గిందని చెప్పారు. అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాలు పాటించకపోవడంతో జనాభా విపరీతంగా పెరిగిందన్నారు. ప్రస్తుత జనాభాను ప్రాతిపదికగా తీసుకొని, దక్షిణాది రాష్ట్రాలను ఆర్థికంగా, రాజకీయంగా నిర్వీర్యం చేయాలని బీజేపీ కుట్ర పన్నుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దక్షిణాదిలో బీజేపీకి బలం లేనందున ఇక్కడి రాష్ట్రాలకు కేంద్రంలో న్యాయమైన వాటా ఇవ్వకూడదన్నదే ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఇప్పటికే పన్నుల వాటాల్లో జనాభా తక్కువైన కారణంగా తెలంగాణ తీవ్రంగా నష్టపోతోందని చెప్పారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో రూపాయి పంపిస్తే రాష్ట్రానికి 42 పైసలు మాత్రమే తిరిగి వెనక్కి వస్తున్నాయని చెప్పారు. జనాభా, పేదరికం ఎక్కువగా ఉన్న కారణంగా బిహార్‌కు రూపాయికి 7.6 రూపాయలు, ఉత్తరప్రదేశ్‌కు రూపాయికి 3 రూపాయలు ఇస్తున్నారని ప్రస్తావించారు. భాష అనేది ఇష్టంతో నేర్చుకునేదని, బలవంతంగా ఏదైనా భాషను రుద్దాలని ప్రయత్నిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. తెలంగాణలో నిర్బంధంగా తెలుగు భాషను అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. జీవోలను కూడా తెలుగులో ఇవ్వబోతున్నామని ప్రకటించారు. తెలుగు భాషను రక్షించుకోవాల్సిన బాధ్యత తెలుగు ప్రజలందరి మీద ఉందని చెప్పారు. ఈ ప్రాచీన భాషను కనుమరుగు చేసే ప్రయత్నాలను ఏ మాత్రం ఒప్పుకోబోమని స్పష్టం చేశారు. యూపీఎస్సీ పరీక్షలను తెలుగులో కూడా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ భాషలకు అత్యంత ప్రాధాన్యమిస్తుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. వివిధ భాషలు, సంస్కృతుల సమ్మేళనమే భారత దేశమని, ఒక భాషను ఇతరులపై రుద్ది, రాజకీయ ప్రయోజనాలు పొందాలని ఎవరైనా చూస్తే ప్రజలు తిప్పికొడతారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే వరంగల్ ఔటర్ రింగు రోడ్డు, విమానాశ్రయం ముందుకు కదిలాయని రేవంత్ చెప్పారు. కేసీఆర్ తన పదేళ్ల కాలంలో ఎప్పుడూ ఈ పని చేయలేదన్నారు. ఇలాంటి వాటి కోసమే పలుమార్లు ఢిల్లీకి వెళుతున్నామని చెప్పారు. కోచ్ ఫ్యాక్టరీని తామే సాధించుకువచ్చామన్నారు. రాష్ట్రానికి అవసరమైన అనుమతులు, నిధుల కోసం ఎన్ని సార్లయినా ఢిల్లీకి వెళతామని రేవంత్ స్పష్టం చేశారు. తాము ప్రత్యేక విమానాల్లో దుబాయ్‌కు, ఇతర దేశాలకు వెళ్లలేదని, ఢిల్లీకి వెళ్లి లిక్కర్ దందా చేయలేదని ఎద్దేవా చేశారు.

## రైల్వే గేటు వద్ద రెండు ఆర్టీసీ బస్సుల ఢీ

**కరీంనగర్ జిల్లా తెలంగాణ ముచ్చట్లు :**

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌లను బస్సులో కరీంనగర్‌కు తరలించి తిరుగు ప్రయాణంలో ఉండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 మంది ఎన్నికల సిబ్బంది గాయ పడ్డారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిర్మల్ జిల్లాకు చెందిన రెండు ఆర్టీసీ బస్సుల్లో అక్కడి బ్యాలెట్ బాక్స్‌లను ఎన్నికల సిబ్బంది గురువారం రాత్రి కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో స్ట్రాంగ్‌రూంకు చేర్చారు. అనంతరం తిరిగి నిర్మల్‌కు వెళుతున్న క్రమంలో వేకువజామున 3 గంటల ప్రాంతం లో జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తురుకకాశీనగర్ ప్రాంతంలోని రైల్వేగేట్ వద్ద బస్సులు ఒక దాని వెనుక మరొకటి ఢీకొన్నాయి. దీంతో వెనుక బస్సులో ఉన్న 19 మందికి గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ ఎండీ నయీమొద్దీన్ కాలు విరిగింది. రెవెన్యూ ఉద్యోగి పురుషోత్తం కడుపు, ఛాతీ భాగంలో దెబ్బలు తగలడంతో ఇద్దరినీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగతా 17 మంది ఉద్యోగులకు స్వల్ప గాయాలు కాగా, వారికి చికిత్స అందిస్తు న్నారు. క్షతగాత్రులను నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ కరీంనగర్ ఆసుపత్రిలో పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.


## రాజీనామాకు సిద్ధమా..?

**హైదరాబాద్, తెలంగాణముచ్చట్లు :**



శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకాల విషయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు అబద్ధాలు చెప్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ హయాంలో 12 కిలోమీటర్లు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వామని, అయితే, తమ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు.. 12 మీటర్లు తవ్వలేదంటూ అబద్ధం చెప్తున్నారని మండిపడ్డారు. జూపల్లి చెప్పింది తప్పని రుజువు చేస్తే మంత్రి పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని సవాల్ విసిరారు.తాము చెప్పేది తప్పయితే ముకు నేలకు రాసి రాజకీయాల నుంచి విరమించుకుంటామని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్‌బీసీకి రూ.3,900 కోట్లు ఖర్చు పెట్టామని, గత కాంగ్రెస్ ప్రభుత్వం కన్నా రూ.600 కోట్లు ఎకువే ఖర్చు పెట్టామని చెప్పారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి ఎనిమిది మంది కూలీలు మట్టిదిబ్బల కింద చిక్కుకొని ఆరు రోజులు అవుతున్నా తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు.సహాయక చర్యలను ప్రభుత్వం నామమాత్రంగా చేస్తున్నదని, రోజూ మంత్రులు హెలికాప్టర్‌లో వెళ్లి గెస్ట్‌హౌస్‌లో కూర్చొని వస్తున్నారని మండిపడ్డారు. మంత్రులు బాధ్యత మర్చి అడ్డగోలుగా మాట్లాడుతూ శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కార్మికులకు ఏమైనా జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని హెచ్చరించారు. ప్రభుత్వం చర్యల వల్లనే టన్నెల్‌లో ప్రమాదం జరిగిందని మండిపడ్డారు. సొరంగంలో ఊట నీళ్లు వస్తున్నాయని, మట్టిపెల్లలు కూలేలా ఉన్నాయని షిఫ్టు పూర్తయిన కార్మికులు చెప్పినా, వినకుండా ఒత్తిడి తెచ్చి కార్మికులను పంపించారని, అందుకే దుర్ఘటన జరిగిందని విమర్శించారు. వారికి రోజు కూలి రూ.500 కూడా ఇవ్వడం లేదని, అది మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నదని విమర్శించారు.మేడిగడ్డ పిల్లర్ కుంగితే రాహుల్‌గాంధీ వచ్చి చూశారని, ఇప్పుడు టన్నెల్ కూలి ఎనిమిది మంది కార్మికులు చిక్కుకుంటే ఆయన ఎందుకు రాలేదని శ్రీనివాస్‌గౌడ్ నిలదీశారు. సొంత జిల్లాలో దుర్ఘటన జరిగితే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. హెలికాప్టర్‌లో మంత్రులు ఎస్ఎల్‌బీసీ వద్దకు పొద్దున వచ్చి సాయంత్రం ఇంటికి పోతున్నారని, కార్మికులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో పెద్దవాగు, సుంకిశాల, ఎస్ఎల్‌బీసీ, వట్టెం పంప్‌హౌస్ కూలిపోయాయని మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇష్టం వచ్చినట్టు మాట్లాడారని, ఎస్ఎల్‌బీసీ దుర్ఘటన కాంగ్రెస్ ప్రభుత్వానికి మచ్చగా మిగులుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ పదవిలో ఉండి గుత్తా సుఖేందర్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, డాక్టర్ మెతుకు ఆనంద్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



**యాదాద్రి, తెలంగాణ ముచ్చట్లు న్యూస్ :**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రధానాలయానికి స్వర్ణ విమాన గోపురం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు మరింత శోభను సంతరించుకోనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వస్తివాచనం, అంకురారోపణం జరగనున్నాయి. ఆదివారం నుంచి 6వ తేదీ వరకు వరుసగా ధ్వజారోహణం, దేవతాహ్వానం, వేదపారాయణ, హవన, అలంకార సేవలు జరుగుతాయి. 7న ఎదుర్కోలు, 8న లక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణోత్సవం, 9న దివ్య విమాన రథోత్సవం, 10న శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవం, 11న శతఘటాభిషేకం, శృంగారడోలోత్సవం, ఉత్సవ సమాప్తి కార్యక్రమాలు ఉంటాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ప్రధానాలయాన్ని, ఆలయ మండపాలను, ముఖద్వారాలను, గోపురాన్ని విద్యుద్దీపాలు, వివిధ రకాల పూలమాలలు, అరటి, మామిడి తోరణాలతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నెల 8న తిరుకల్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్వామివారిని దర్శించుకొని.. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కొండపైకి వాహనాలను ఉచితంగా అనుమతించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆలయ ఈవో ఏపూరి భాస్కర్‌రావు వెల్లడించారు.



## ఏసీబీకి చిక్కిన హెచ్ఎం

**కొత్తగూడెం, తెలంగాణ ముచ్చట్లు న్యూస్ :**

చెల్లింపు విషయంలో పాఠశాల హెచ్ఎం రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకున్నది. కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో ఓ కరాటే మాస్టర్ విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నాడు. అతడికి సంబంధించి రూ.30 వేల బిల్లు ప్రభుత్వం నుంచి మంజూరైంది. ఆ బిల్లును సదరు కరాటే మాస్టర్‌కు చెల్లించ కుండా పాఠశాల హెచ్ఎం తాటి రవీందర్ ఇబ్బందులకు గురి చేయడంతోపాటు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. శుక్రవారం పాఠశాలలో కరాటే మాస్టర్ నుంచి హెచ్ఎం రవీందర్ రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్ గా పట్టుకున్నారు.




## జర్నలిస్ట్ కార్పోరేషన్ ఏర్పాటుకై
# మార్చి 16న చలో హైదరాబాద్

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**
జర్నలిస్టులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ తోపాటు జర్నలిస్టు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మార్చి 16న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్ మాదిగ, దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల ఎల్లేష్, ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లా సంతోష్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ కోఠి లో గల బీసీ సాధికారిత భవన్లో జరిగిన జర్నలిస్టుల సమావేశంలో వారు మాట్లాడారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ సంఘాల ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డు లు, హెల్త్ కార్డులు,ఇంటి స్థలాలు సమస్యలతో పాటు దాడులు, హత్యలకు గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టులు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని జర్నలిస్టుల సంఘాలు భావిస్తున్నాయన్నారు. చిన్న పత్రికలు, వార, మాస, పక్ష పత్రికల కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ఆర్థిక అభివృద్ధి కోసం చర్యలను, రూట్ మ్యాప్ ను ప్రకటించకపోవడం విచారించదగ్గ విషయమన్నారు. ఈ సమావేశంలో ఆయా జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తక్కల్లపల్లి రాజేందర్, కోళ్ల శివ, కాటేపాగ హుస్సేన్, మైలారపు ప్రేమ్ , బొల్లెపాక రాజేష్, అంకగళ్ల కరుణాకర్, సుక్క అశోక్, సుంచు లింగయ్య, కడియం నాగయ్య, పెద్దింటి శ్రీనివాస్, మంచాల అనిల్, స్వామి, శివ, నరసింహ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనకు ఏర్పాట్లు
# పకడ్బందీగా ఉండాలి



**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**
మార్చ్ 2న ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి వనపర్తి జిల్లా పర్యటనలను దృష్టిలో ఉంచుకొని బహిరంగ సభకు విచ్చేసే అతి ప్రముఖులు, రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధుల సభకు వచ్చే జన సమీకరణకు అవసరమైన వసతులు పకడ్బందీగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్,బదిలీ అయిన అదనపు లోకల్ బాడీస్ స్థానిక సంస్థల కలెక్టర్ సంచిత్ గంగువార్,వనపర్తి జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ జి వెంకటేశ్వర్లు. వనపర్తి జిల్లా మీడియా పౌర సమాచార అధికారి సీతారాంనాయక్, వనపర్తి జిల్లా జిల్లా జడ్పీ సీఈఓ యాదయ్య, వనపర్తి ఆర్టీవో సుబ్రహ్మణ్యం, వనపర్తి స్థానిక తహసిల్దార్ రమేష్ రెడ్డి, వనపర్తి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మధుసూదన్, సిఐలు, ఎస్ఐలు,వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావుతో కలిసి ఏర్పాట్లను పర్యేక్షించారు.

## కేరళ హైస్కూల్లో ఘనంగా సైన్స్ఎక్స్ పో






**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు :**
ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల కేరళ హైస్కూల్లో శుక్రవారం ఘనంగా సైన్స్ ఎక్స్ పోని నిర్వహించడం జరిగింది ఈ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను కేరళ హైస్కూల్ డైరెక్టర్ బైరబోయిన సంపత్ ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం సంప్రదాయ బద్దంగా కాకుండా ఆధునిక ఆలోచనలను జోడించి విద్య ను అందించాలని తద్వారా వారిలో సృజనాత్మకత పెంపొందుతుందని పేర్కొన్నారు విద్య అనేది ఉపన్యాస పద్ధతిలో కాకుండా చేయడం ద్వారా నేర్చుకోవడం అనే విధానంలో అందించడం జరగాలని, ఇలాంటి సైన్స్ ఎక్స్ పోలు పిల్లలలో నేను చేయగలను, నేను సాధించగలను అనే భావనలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్లను సందర్శించి వారికి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో కేరళ హైస్కూల్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ మరియు ఉపాధ్యాయులు నాన్ టీచింగ్ స్టాఫ్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ముమ్మరంగా ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
మార్చ్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వనపర్తికి వస్తున్న సందర్భంగా.. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.శుక్రవారం ఆయన పాలిటెక్నిక్లో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ దగ్గరుండి పర్యవేక్షించారు.జన సమీకరణకు సంబంధించి ఆయా మండలాల నాయకులతో ప్రత్యేకంగా మాట్లాడి ఏర్పాట్లకి సంబంధించిన ఆదేశాలను జారీ చేశారు.అధికారులతో సమన్వయం చేస్తూ మొదటిసారి నియోజకవర్గానికి ముఖ్య మంత్రి వస్తున్న సందర్భంగా

నిర్వహించే కా ర్యక్రమాలన్నింటిని పూర్తిస్థాయిలో పర్యవేక్షిం చాలని సభను పెద్ద ఎత్తున జయప్రదం చేయాలన్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా నిర్వహించబోయే కార్యక్రమాల సందర్భంగా వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజ కార్యక్రమం, ముఖ్యమంత్రి అద్దెకుండి విద్యాభ్యాసన చేసిన పార్వతమ్మ ఇంటి పరిశీలన, క్యాంపు కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు, జూనియర్ కళాశాల ఆవరణలో చేపట్టే శంకుస్థాపన కార్యక్రమాల ఏర్పాట్లను, ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో మొట్ట మొదటిసారిగా నియోజకవర్గానికి
ఎను ముల రేవంత్ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రతి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు ఆయన పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ పట్ట నాయకులు ఆయా మండలాల నాయకులు కార్యకర్తలు, అధికారులు, తదితరులు ఉన్నారు.




# గ్రీన్ ఫీల్డ్ బాధిత రైతుల మోర ఆలకించిన కలక్టర్







**సత్తుపల్లి, ఆర్సి,తెలంగాణ ముచ్చట్లు:**
మండల పరిధిలోని సదాశివునిపాలెం, తుంబూరు గ్రామాలకు చెందిన రైతులు, వేంసూరు మండల పరిధిలోని లింగపాలెం గ్రామానికి చెందిన రైతులు గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి ముందు రైతులకు ఎన్.హెచ్.ఏ. (నేషనల్ హైవే అథారిటీ) ఇచ్చిన హామీలు మరిచి రైతులను మోసం చేస్తుందని ఇటీవల ఖమ్మం జిల్లా కలక్టర్ ముజామిల్ ఖాన్కు మోర పెట్టుకున్నారు. అట్టి విషయమై శుక్రవారం కలక్టర్ రైతుల మోర ఆలకించి విచారణకు కల్లూరు ఆర్డిఓకు ఆదేశాలు జారీ చేశారు.దీంతో శుక్రవారం మూడు ప్రాం తాలను ఆర్డిఓ. రాజేందర్ గౌడ్ పరిశీలించి రైతుల బాధలను అడిగి తెలుసుకున్నారు. ఎన్హెచ్ఏ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ప్రధానంగా చూస్తే రైతులు తమ పంట చేలకు వెళ్ళే దానికి దారి లేదని, అండర్ పాస్లు కొన్ని చోట్ల ఎత్తు తక్కువ వున్నాయని, సర్వీస్ రోడ్లు వేయాలని కోరుతున్నారు.ఈ పర్యటనలో సత్తుపల్లి మండల ఇంచార్జీ తహశీల్దార్ శివకుమార్, సిబ్బంది హరిప్రసాద్,రైతులు పాల్గొన్నారు.

# రెండు వేల మంది విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్లు అందించినా యువ సేవా సమితి



**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**
ఖమ్మం జిల్లా, సత్తుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్లు యువ సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ గారి చేతుల మీదుగా అందించడం జరిగింది. యువ సేవా సమితి వ్యవస్థాపకులు జొన్నగట్ల రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దాతల సహకారంతో రెండు వేల మంది విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ గారు మాట్లాడుతూ యువసేవ సమితి ద్వారా అనేక కార్యక్రమాలు చేయడం జరుగుతుందని,అతి చిన్న వయసులో ఈ కార్యక్రమాలు చేయడానికి పూను కోవటం, ఆర్థిక బలము లేనప్పటికిని సేవ చేయాలని మనోధైర్యంతో ముందుకు సాగుతున్న ఈ యువ సేవ సమితికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. భవిష్యత్తులో అనేక కార్యక్రమాలు చేయాలని కోరుతున్నాను. జరగ బోయే పరీక్షలు మంచి మార్కులు తెచ్చుకొని మీకును, తల్లిదండ్రులకు ఉన్నత స్థాయి తేవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు,సొసైటీ చైర్మన్ చల్లగుల్ల కృష్ణయ్య ,ఖమ్మం జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్,కాంగ్రెస్ నాయుకులు మానుకోట ప్రసాద్,యువ సేవ సమితి ఇంచార్జ్ తన్నీరు మురళి,యువ సేవా సమితి సభ్యులు అభిలాష్,సిమ్యూల్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మను దర్శించుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే యం. పద్మదేవేందర్ రెడ్డి



**మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు:**
జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే ఎం పద్మ దేవేందర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ఏడుపాయల జాతర పురస్కరించుకొని వనదుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా మాట్లాడుతూ వనదుర్గామాత ఆశీస్సులతో మెదక్ జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయా అర్చకులు ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం జాతరలో ప్రతి ఏటా మాదిరిగా గాజులు కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ లు బాల గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, పాపన్నపేట పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రెడ్డి,మాజీ ధర్మకర్తలు మనోహర్ దుర్గయ్య కిష్టయ్య, తాజా మాజీ సర్పంచ్ లు జగన్,గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, శ్రీనాథ్ రావు,బద్రి మల్లేశం,నవీన్ గౌడ్ నాయకులు వెంకటేశం, సాయిరెడ్డి,బాబా గౌడ్, సాయిరెడ్డి,కిష్టయ్య,కిష్టాగౌడ్, శంకర్ సెట్, శ్రీనివాస్,మల్లేష్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు


**- పరీక్షలు జరిగే ప్రదేశాలలో ఆ సమయానికి (163) %బీఎన్ఎస్% సెక్షన్ అమలు**
**- జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు (30) సెంటర్లలో మొత్తం (6238) మంది విద్యార్థులు**
**- మార్చ్ 5 నుంచి 23 వరకు పరీక్షలు**
**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.**





**మెదక్ జిల్లా బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**
జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ నిర్వహించడానికి అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.
శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు అనుమతించరాదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎక్కడా కూడా తప్పులు దొర్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో 163 బిఎన్ ఎస్ ఎస్ సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు తాగునీరు, మూత్రశాలల సౌకర్యం వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనంలో పరీక్ష పేపర్లను తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎగ్జామ్ ప్యాడ్, పెన్, పెన్సిల్, రబ్బర్, హాల్ టికెట్లను మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ప్రతి సెంటర్ కు ఇద్దరు కానిస్టేబుళ్ళతో బందోబస్తు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు కాంపౌండ్ వాల్ లేని వాటికి బారికేడ్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రాథమిక చికిత్స కిట్ లు అందుబాటులో ఉండాలని, ఆశా వర్కర్లను నియమించాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థుల గదుల్లో ఎలాంటి మెటీరియల్ లేకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పేపర్ల తనిఖీ నిర్వహించాలని తెలిపారు. అలాగే ఎక్కడా కూడా మాల్ ప్రాక్టీస్ కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సుల సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పని తీరును సరిచూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి సంబంధింత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేజ్రీవాల్ అవినీతిపై పర్వేష్ వర్మ





**న్యూఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు న్యూస్ :**
ఆమ్ ఆద్మీ పార్టీ నేషనల్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరుపుతామని ఢిల్లీ కేబినెట్ మంత్రి పర్వేష్ వర్మ తెలిపారు. కేజ్రీవాల్ అవినీతి బహిర్గతమవుతుందని, ఆయన ఇక ఈ జన్మలో తీహార్ జైలు నుంచి తిరిగి వస్తారని తాను అనుకోవడం లేదని చెప్పారు. ఆప్ హయాంలో జరిగిన అవకతవలపై 'కాగ్' నివేదికలను ఢిల్లీ అసెంబ్లీలో ప్రవేశపెడుతున్న నేపథ్యంలో మంత్రి తాజా వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పూర్తి స్థాయి రాష్ట్రం కానప్పటికీ పాలనా పరంగా చాలా కీలకమని పర్వేష్ వర్మ తెలిపారు. "ముఖ్యమంత్రి నేతృత్వంలో మేమంతా ఢిల్లీని అభివృద్ధి చేసి పూర్తిస్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. గత ప్రభుత్వం ఢిల్లీని లండన్ గా మారుస్తామని హామీలిచ్చి, స్కూళ్లు, దేవాలయాలు, చివరికి శీష్ మహల్లోనూ లిక్కర్ దుకాణాలు తెరిచింది. అత్యంత విలాసవంతమైన కార్యాలయాలు నిర్మించారు, కానీ ఎవ్వరినీ లోపలికి అనుమ తించ లేదు" అని ఆయన అన్నారు.కజ్రీవాల్ రాజకీయ ప్రయోజనాల కోసం సొంత తల్లిదండ్రులను కూడా వాడుకున్నారని పర్వేష్ వర్మ ఆరోపించారు. తన తండ్రి నడవగలి గినప్పటికీ కేవలం ఓట్ల కోసం ఆయనను వీల్‌చైర్‌లో తీసుకువచ్చారని చెప్పారు. "ఎన్నికల కోసం కేవలం రెండు నెలల్లో ఢిల్లీని జాట్లు, బనీయాస్ అంటూ కులాల పేరుతో విడదీశారు. బెంగాలీ క్యాంపునకు నేను వెళ్లినప్పుడు మోనీ దాస్ అనే ఒక వితంతువు తన కుమారులిద్దరినీ మద్యం విధానంతో కేజ్రీవాల్ పొట్టనపెటుకున్నారని వాపోయింది. అలాంటి ఉదాహరణలు చాలానే ఉన్నాయి" అని పర్వేష్ వర్మ చెప్పారు. ప్రాంతాల పేర్లు మార్పుపై పర్వేష్ వర్మను అడిగినప్పుడు, పేర్లు మార్పే కాదు, సంస్కృతీ వారసత్వాన్ని కాపాడటం అనివార్యమని చెప్పారు. దురాక్రమణదారులు అనేక పేర్లు మార్చేశారని, వాటిని తిరిగి పునరుద్ధరిస్తామని చెప్పారు. కేజ్రీవాల్ హయాంలో జరిగిన ప్రతి ఒక్క కుంభకోణంపై విచారణ జరుపుతామని, ఆయన హయాంలో ఒక్క బంగ్లాదేశీకి రేషన్ కార్డ్ జారీ చేసినట్టు గుర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఢిల్లీలో శాంతిభద్రతల పరిస్థితిపై అమిత్‌షా సమీక్ష




**న్యూఢిల్లీ, తెలంగాణముచ్చట్లు న్యూస్ :**
దేశరాజధానిలో ట్రాఫిక్ జామ్‌లు, చొరబాటుదార్ల సమస్యపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ఆదేశించారు. ఢిల్లీలో శాంతిభద్రతల పరిస్థితిపై శుక్రవారంనాడిక్కడ జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ఆయన సమీక్షించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, హెూం మంత్రి ఆశిష్ సూద్, సీనియర్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర హెూం శాఖ కార్యదర్శి, ఐబీ చీఫ్, ఎంహెచ్‌ఏ సీనియర్ అధికారులు సైతం పాల్గొన్నారు. దేశంలోకి బంగ్లాదేశ్, రోహింగ్యా చొరబాటు దారులకు సహకరించే నెట్‌వర్క్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అమిత్‌షా ఆదేశించారు.

**సమావేశంలో కీలక నిర్ణయాలు**
–ఢిల్లీలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంచనాలకు అనుగుణంగా సత్వర అభివృద్ధి, సురక్షిత ఢిల్లీ దిశగా రెట్టించిన వేగంగా పనిచేయాలని అమిత్‌షా ఆదేశించారు.
–దేశంలో బంగ్లాదేశీ, రోహింగ్యా చొరబాటుల అక్రమ ప్రవేశానికి డాక్యుమెంట్లు సృష్టించి, ఇక్కడే ఉండేలా సహకరిస్తున్న నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం మోపాలి.
–దేశభద్రతకు అక్రమ చొరబాటులు విఘాతం. దీనిపై కఠినంగా వ్యవహరించి, అక్రమ చొరబాటుదార్లను గుర్తించి, వారిని వెనక్కి పంపాలి.
–ఢిల్లీలోని అంతర్రాష్ట్ర ముఠాలను గుర్తించి కఠినంగా వ్యవహరించేందుకు ఢిల్లీ పోలీసులు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.
–నార్కోటిక్ కేసులను సీరియస్‌గా తీసుకుని నెట్‌వర్క్ మొత్తాన్ని ధ్వంసం చేయాలి.
–ఢిల్లీలో నిర్మాణాలకు సంబంధించిన అంశాల్లో ఢిల్లీ పోలీసుల అనుమతి అవసరం లేదు.
–2020 ఢిల్లీ అలర్ల కేసులను సత్వర పరిష్కారానికి స్పెషల్ ప్రాసిక్యూటర్లను ఢిల్లీ ప్రభుత్వం నియమించుకోవచ్చు.
– అదనపు పోస్టుల భర్తీ ప్రక్రియను ఢిల్లీ పోలీసులు సత్వరం ప్రారంభించవచ్చు.
–డీసీపీ స్థాయి అధికారులు పోలీసులు స్టేషన్లకు వెళ్లి, పబ్లిక్ హియరింగ్ క్యాంపులు నిర్వహించడం ద్వారా ప్రజాసమస్యలు పరిష్కరించాలి.
–మహిళలు, పిల్లల భద్రత కోసం జేజే క్లస్టర్లలో కొత్త సెక్యూరిటీ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి.

–ఢిల్లీ పోలీసులు నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో ఉన్న ప్రాంతాలను గుర్తించాలి. ఢిల్లీ పోలీస్ కమిషనర్, చీఫ్ సెక్రటరీ కలిసి సమస్యకు సత్వర పరిష్కారం కనుగొనాలి. ప్రజలకు ట్రాఫిక్ జామ్‌ల నుంచి ఉపశమనం కలిగించాలి.
–నీళ్లు ఎక్కడైతే నిలిచిపోతున్నాయో గుర్తించేందుకు "మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్"ను ఢిల్లీ ప్రభుత్వం సిద్ధం చేయాలి.

# శనివారం డయల్ యువర్ డిఎం

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు :**



మార్చి 1వ తేదీ (శనివారం) సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు సత్తుపల్లి డిపోలో డయల్ యువర్ డిపో మేనేజర్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యు. రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులు శనివారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ఫిర్యాదులు, సలహాలు, సూచనల కొరకు 9959225962 కు ఫోన్ చేసి డిపో మేనేజర్ తో మాట్లాడవచ్చునని అన్నారు. ఈ సదా అవకాశాన్ని సత్తుపల్లి డిపో పరిధిలోని ప్రయాణికులు అందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# ఘనంగా టైలర్స్ 'డే' వేడుకలు



**సత్తుపల్లి , తెలంగాణ ముచ్చట్లు:**
ఖమ్మం జిల్లా,సత్తుపల్లి పట్టణ కళాభారతి వేదికలో సత్తుపల్లి మండల లేడీస్ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టైలర్స్ "డే" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి టైలర్స్ డే శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు,పట్టణ,మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, టైలర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి పక్షాల కుట్రను తిప్పికొట్టండి:

# మట్టా దంపతులు!



**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**
నియోజకవర్గంలో ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని యువతకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి,దయానంద్ దంపతులు పిలుపునిచ్చారు.గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఎన్.ఎస్.యు.ఐ,కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకొని ప్రజలను యువత కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో గాదె చెన్నారావు,కాసర చంద్రశేఖర్ రెడ్డి,దుదిపాళ్ళ రాంబాబు,తోట సుజలరాణి, నారాయణవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు





**తెలంగాణ ముచ్చట్లు (నూగూరు) వెంకటాపురం ములుగు జిల్లా**
మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవివి సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రం గురించి తెలియజేస్తూ ప్రతి విద్యార్థి విజ్ఞాన శాస్త్రాన్ని అధ్యాయనం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శ్రీనివాస్, బి జయరాం, సుజాత, శేష నరసింహారావు, శోభన్, విద్యార్థులు పాల్గొన్నారు.






# సర్వజ్ఞలో సైన్స్ డే యువ ఆవిష్కర్తల మెరుపులు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మంలోని వీడివోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని "సర్వజ్ఞ శ్రీకార్ - ది సైన్స్ ఎగ్జిబిషన్" నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. రోబోటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ వంటి వివిధ రంగాలకు సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నాయి. వీటి ద్వారా వారి శాస్త్రీయ అవగాహన, నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఆర్. వి. నాగేంద్ర కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి, సి. వి. రామన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తదుపరి మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు వారి సృజనాత్మకతకు, శాస్త్రీయ పరిజ్ఞానానికి నిదర్శనంగా నిలిచాయి అన్నారు. సైన్స్ రంగంలో రామన్ విశిష్ట కృషికి గాను రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజు జాతీయ సైన్స్ దినోత్సవం గా జరుపుకుంటున్నాము అని అన్నారు. రామన్ ఎఫెక్ట్ గాను సైన్స్ రంగంలో సి.వి. రామన్ గారు అత్యున్నత నోబెల్ పురస్కారం అందుకున్నారు అని తెలియజేశారు.

తదుపరి పాఠశాల డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ ఈ రోజు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది అని అన్నారు. సైన్స్ అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాదు, అది మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, మన జీవితాలను మెరుగుపరచడానికి ఒక సాధనం అన్నారు. మన పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా, ఇంజనీర్లుగా ఎదగాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ పవిత్ర గారు మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడం తమ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మరియు విద్యార్థులకు వారి కృషి, పట్టుదలే ఒక గొప్ప నిదర్శనం అని ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# శైవ క్షేత్రాలలో ఆర్జేసి కృష్ణ ప్రత్యేక పూజలు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



స్థానిక ట్రంక్ రోడ్ ప్రాంతంలోని స్వయంభూ గుంటు మల్లేశ్వర స్వామి,తెల్దారు పల్లిశైవ క్షేత్రం ల లో బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బిఆర్ఎవస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి కృష్ణ దంపతులు, కూతురు డా.జి.ధాత్రి విశేష అభిషేకాలు నిర్వహించారు.బుధవారం వేకువ జామున ఆలయానికి వెళ్లిన వారు శివ లింగానికి అర్చన, అభిషేకాలు నిర్వహించారు.

**మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిని పరామర్శించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి**

# దామోదర్ రాజనర్సింహ



**మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు**

నర్సాపూర్ మాజీ శాసనసభ్యులు చిలుముల మదన్ రెడ్డికి ఇటీవల గుండె ఆపరేషన్ జరిగిన విషయం తెలుసుకొని, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి స్వయంగా హైదరాబాదులోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉన్న వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజనేయులు గౌడ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.ఆవుల రాజిరెడ్డి మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి తెలుసుకున్నారు. అలాగే, త్వరితగతిన కోలుకుని ప్రజాసేవలో మరింత క్రియాశీలంగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# అమరావతి- అంకెల గారడీలా రాష్ట్ర బడ్జెట్

**- ఆత్మస్తుతి-పరనిందకే పరిమితమైన బడ్జెట్**

**- చంద్రబాబు, లోకేష్ ల పొగడ్తలతో ముంచెత్తారు- గత ప్రభుత్వాన్ని దూషించడానికే ప్రాధాన్యత**

**- ఏ ఒక్క వర్గానికి మేలు చేయని బడ్జెట్ ఇది**

**- ఎన్నికల హామీల అమలుకు కేటాయింపులు ఏవీ?**

**- తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు అరకొర కేటాయింపులు**

**- నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు- మహిళలకు ఉచిత బస్సు ఊసే కనిపించలేదు:**



వైయస్ఆర్ సీపీ ఎమ్మెల్సీల ధ్వజంఅమరావతి: కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ కేవలం అంకెల గారడీలా ఉందని వైయస్ఆర్సీపీకి చెందిన శాసనమండలి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం సభ వాయిదా తరువాత అసెంబ్లీ బయట వైయస్ఆర్ సీపీకి చెందిన ఎమ్మెల్సీలు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వాన్ని దూషించడం, సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ లను పొగడ్తలతో ముంచేత్తడానికే బడ్జెట్ ప్రసంగంలో ప్రాధాన్యత ఇచ్చారని వారు మండిపడ్డారు. ఎన్నికల హామీల అమలుకు సంబంధించిన అంశాలు లేకుండా, అరకొర కేటాయింపులతోనే బడ్జెట్ ను ఆత్మస్తుతి–పరనిందతో ముగించారని అన్నారు.

ఎవరెవరు ఏమన్నారంటే.

.– బడ్జెట్ పేరుతో మరోసారి వంచన: బొత్స సత్యనారాయణ, శాసనమండలి ప్రతిపక్షనేత

గత ప్రభుత్వాన్ని దూషిస్తూ... సీఎం, ఆయన తనయుడిని ప్రశంసలతో ముంచెత్తుతూ... కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్ ను ప్రవేశపెట్టడం చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. చట్టసభల్లో సభ్యుడుగా సుదీర్ఘ అనుభవం ఉంది. ఎప్పుడూ ఇలా పొగడ్తలతో బడ్జెట్ ను ముంచేయడం చూడలేదు. ఇటువంటి సంప్రదాయం కొత్తగా ఉంది. బడ్జెట్ ప్రసంగంలో ఎందుకు ఇన్నిసార్లు చంద్రబాబు, లోకేష్ లను పొగడటం చేశారో అర్థం కాలేదు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలపై కేటాయింపులు ఎక్కడా లేవు. ప్రభుత్వం ప్రజలను మళ్ళీ మోసం చేసింది. సూపర్ సిక్స్ అంటూ గొప్పగా ప్రజలను నమ్మించారు. మహిళలకు తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15వేలు, నిరుద్యోగులకు రూ.3000 భృతి, రైతులకు రూ.20వేల భరోసా అన్నారు. కానీ వాటికి చేసిన కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. రాష్ట్రంలో 81 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వారికి తల్లికి వందనం ఇవ్వలంటే దాదాపు రూ.12వేల కోట్లు అవసరం. కానీ కేటాయింపులు చూస్తే కేవలం రూ. 9,400 కోట్లు మాత్రమే. రాష్ట్రంలో కింద 52 లక్షల మందికి మా ప్రభుత్వంలో రైతుభరోసా ఇచ్చాం. ఈ రోజు అంతమందికి ఇరవై వేల చొప్పున సుమారు రూ.12వేల కోట్లు అవసరం. కానీ బడ్జెట్ లో కేటాయించింది నామమాత్రమే. మహిళలకు అట్టహాసంగా ఉగాది నుంచి ఉచిత బస్సు అన్నారు. దీనిపై ఎక్కడా ప్రస్తావనే లేదు. ఇక మూలధన వ్యయంపై పొంతన లేకుండా చూపించారు. గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వంలో రూ.3000 కోట్లు మార్కెట్ ఇంట్రవెన్షన్ కింద నిధిని ఏర్పాటు చేసి, రైతులను ఆదుకున్నాం. ఈ కూటమి ప్రభుత్వంలో కేవలం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇదేనా రైతుల పట్ల కూటమి ప్రభుత్వానికి ప్రేమ? మిర్చియార్డ్ లో రైతుల కష్టాలను తెలుసుకునేందుకు వెళ్ళిన వైయస్ జగన్ గారిపైన కేసులు పెట్టారు. ఇప్పుడు బడ్జెట్ లో మిర్చి రైతులకు ధర లభించడం లేదు, కేంద్రం ఆదుకోవాలని ప్రస్తావించారు. ఈ రోజు వరకు ఒక్క బస్తా మిర్చి అయినా ప్రభుత్వం కొనుగోలు చేయించిందా? బడ్జెట్ సమావేశల్లో వైయస్ఆర్సీపీ నిర్మాణాత్మకంగా ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలను ఎండగడుతుంది.

– ఉత్పాదక రంగానికి కేటాయింపులు లేవు :

కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ

అంకెలే తప్ప అభివృద్ధి కనిపించని బడ్జెట్ ఇది. బడ్జెట్ అనేది భవిష్యత్ తరానికి సంబంధించి ఆలోచనలతో కూడుకున్నదై ఉండాలి. ఏ రంగంలోనూ స్పష్టత లేకుండా కేవలం రూ.3.26 లక్షల కోట్లు అంటూ అంకెలను ప్రకటించారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, వెనుకబడిన వర్గాలకు ఎక్కడా బడ్జెట్ కేటాయింపులు సక్రమంగా లేవు. మూలధన వ్యయం గురించి చాలా అస్పష్టంగా పొందుపరిచారు. ఉత్పాదక రంగంపై కేటాయింపులు జరిగితే దానివల్ల అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ బడ్జెట్ లో ఉత్పాదకరంగాన్ని పూర్తిగా విస్మరించారు. ఉత్పాదకరంగంపై బడ్జెట్ కేటాయింపులు లేకుండా సంపద ఎలా సృష్టిస్తారు? ప్రజలను మోసం చేసే బడ్జెట్ ఇది. రైతాంగాన్ని, నిరుద్యోగులను విస్మరించారు. సూపర్ సిక్స్ కు సంబంధించి ఏ విషయం మీదా క్లారిటీ లేదు. మహిళలకు ఉచిత బస్సుకు కేటాయింపులు లేవు. నిరుద్యోగులకు మూడు వేల హామీ పై ప్రస్తావనే లేదు. రైతాంగాన్ని ఆదుకునేందుకు చేసిన కేటాయింపులు లేవు. బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ లోని డొల్లతనంపై ఖచ్చితంగా ప్రభుత్వంను నిలదీస్తాం. సామాన్య ప్రజానీకానికి ఈ బడ్జెట్ వల్ల ఒరిగేది లేదు. మాటలతో గారడీ చేసిన బడ్జెట్ ఇది. ఏ వర్గానికి ఎటువంటి ప్రయోజనం లేదు.

– – ఉద్యోగులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం:

పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ

గత ఏడాది ఎన్నికల సందర్భంగా ఉద్యోగులు, నిరుద్యోగులను కూటమి పార్టీలు హామీలతో ఆకట్టుకున్నారు. 2019లో జగన్ గారు ఉద్యోగులకు 29 శాతం ఐఆర్ ప్రకటించారు. 23 శాతం పీఆర్సీని ఇచ్చారు. కూటమి ప్రభుత్వం మంచి ఐఆర్ ఇస్తామని, పీఆర్సీని అమలు చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ఈ బడ్జెట్ లో ఐఆర్ ప్రకటిస్తారు, పీఆర్సీ కోసం కమిటీ వేస్తారని అందరూ ఆశగా ఎదురుచూశారు. కానీ ఎక్కడ దానిపై ప్రస్తావన లేదు. నిరుద్యోగులకు సంబంధించి మెగా డీఎస్సీ అని ప్రకటించి, ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. కొత్త ఉద్యోగాల గురించి ఎక్కడా ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. నిరుద్యోగులకు ఇస్తామన్న భృతిపై కేటాయింపులు లేవు. విద్యార్ధులకు గత ఏడాదికి సంబంధించి మూడు క్వార్టర్ల బకాయిలను కూడా చెల్లించలేదు. ఇప్పటి వరకు ఆరు క్వార్టర్ల ఫీజు రీయింబర్స్ మెంట్ పెండింగ్ లో పెట్టారు. పరీక్షలు పూర్తవుతున్న నేపథ్యంలో బకాయిలు ఉన్నాయంటూ విద్యాసంస్థల యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు. రాష్ట్రం అప్పుల పాలయ్యిందని గత ప్రభుత్వంపై నిందలు వేశారు. ఈ రోజు బడ్జెట్ లో జగన్ గారు 2023–24 లో కేవలం రూ.79 వేల కోట్లు మాత్రమే అప్పులు తీసుకువచ్చారని రాశారు. అన్ని పథకాలు అమలు చేసిన తరువాత కూడా చేసిన అప్పులు ఇవి. కానీ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలకు గానూ ఏ పథకాన్ని అమలు చేయకుండానే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.04 లక్షల కోట్లు అప్పులు చేస్తామని, గత ఏడాది రూ.98,576 కోట్లు అప్పులు చేశామని బడ్జెట్ లో ప్రకటించారు. బడ్జెట్ లోని డొల్లతనంపై సభలో నిలదీస్తాం. – 3వ తేదీన వీసీల బలవంతపు రాజీనామాలపై ఆధారాలు బయటపెడతాం రాష్ట్రంలో వీసీల రాజీనామాలపై మంత్రి నారా లోకేష్ కు ఆధారాలు ఇస్తామని చెప్పాం. పంతొమ్మిది మంది వీసీలను బెదిరించి రాజీనామాలు చేయించారు. మూడో తేదీన అన్ని ఆధారాలను సమర్పించబోతున్నాం. వీసీలు ఇచ్చిన రాజీనామాల్లో ఏపీ ప్రభుత్వం నుంచి సూచనలు, ఉన్నత విద్యామండలి చైర్మన్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రాజీనామా చేస్తున్నట్లు రాశారు. బలవంతంగా చేయించారనేది దానిని బట్టి అర్థమవుతోంది. వీసీల వద్దకు వెళ్లి టీడీపీ గుండాలు బెదిరించి రాజీనామాలు చేయించారు. దీనికి సంబంధించిన వీడియోలను కూడా సమర్పిస్తాం. ఈ ఘటనలపై మీడియాలో వచ్చి కథనాలు, వీడియోలను కూడా అందచేస్తాం. రెండు రోజుల్లో రాజీనామా చేయాలంటూ ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు. దీనిపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ వేయాలి. వీసీలపై దాడులకు తెగబడిన వారికి నామినేటెడ్ పదవులు కూడా ఇచ్చారు.

# రాష్ట్ర ఆర్థిక స్థితిని పట్టాలెక్కించే బడ్జెట్

అమరావతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సంక్షేమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ఉంది. అందుకు అనుగుణంగా కేటాయింపులు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ అన్నారు.. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో రెవెన్యూ లోటు, ద్రవ్య లోటు తగ్గించే చర్యలు చేపట్టింది. ఈ బడ్జెట్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల భవిష్యత్తుకు భరోసానిచ్చేలా, అభివృద్ధికి బాటలు వేసేదిగా ఉంది. ప్రాధాన్యతల వారీగా అన్ని శాఖలకు కేటాయింపులు పెరగడంతో పాటు, మూలధన వ్యయాన్ని రూ.40,636 కోట్లకు పెంచడం ద్వారా మౌలిక వసతులు రాష్ట్రంలో పెరుగుతాయి. తద్వారా రాబోయే రోజుల్లో రాష్ట్ర రాబడి పెంపుదలకు బాటలు వేసినట్లు అయింది. రూ.3,22,359 కోట్లతో ప్రణాళికాబద్ధంగా రూపొందిన బడ్జెట్ ఇది. సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ లో కేటాయింపులు చేయడం కూటమి ప్రభుత్వ విధానాన్ని తెలియజేస్తుందని అన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు బడ్జెట్లో తగిన కేటాయింపులు జరపడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. ఇప్పటికే అందిస్తున్న పింఛన్ల పెంపుదల, దీపం 2 పథకాలకు నిధుల కేటాయింపుతోపాటు మిగిలిన సూపర్ సిక్స్ పథకాల హామీలను తప్పకుండా నెరవేరుస్తామని బడ్జెట్ కేటాయింపుల ద్వారా నిరూపించుకున్నాం. 'తల్లికి వందనం' పథకాన్ని ఈ ఏడాది మే నుంచి అమలు చేసేందుకు రూ.9,407 కోట్లను కేటాయించారం అన్నదాతలకు భరోసానిచ్చేలా ఏడాదికి రూ.20 వేలు ప్రతి రైతుకు సాయం అందేలా 'అన్నదాత సుఖీభవ' పథకానికి ప్రణాళికలు సిద్ధం అయ్యాయి. సాగు నీటి రంగానికి రూ.18,019 కోట్లు కేటాయింపులు శుభపరిణామం.

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్న మహాత్ముడి వాక్కు అనుసారం గ్రామీణాభివృద్ధికి రూ.18,890 కోట్ల భారీ కేటాయింపులు ద్వారా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జోరందుకుంటాయి. నిధుల లేమి అనేదే లేకుండా గ్రామాల్లో అభివృద్ధి ఊపందుకోవడానికి ఈ బడ్జెట్ బాటలు వేస్తుంది. గ్రామాలకు కావల్సిన వసతులు, సౌకర్యాల కల్పనకు ఈ కేటాయింపులు దోహదం చేస్తాయి. జల్ జీవన్ మిషన్ పథకానికి బడ్జెట్ లో ప్రాధాన్యం దక్కడం సంతోషంగా ఉంది. గత ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కు రాష్ట్ర వాటా కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టింది. వచ్చిన నిధులను ప్రణాళిక లేకుండా ఇష్టానుసారం వ్యయం చేశారు. జల్ జీవన్ మిషన్ ను కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2028 వరకు గడువు పొడిగించడం మన రాష్ట్రానికి ప్రయోజనకరమైన విషయం. వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వ్యవసాయ బడ్జెట్ కేటాయింపులు చెబుతున్నాయి. ఆక్వా రైతులకి విద్యుత్ యూనిట్ ధరను రూ.1.50పై. చేయడం హర్షణీయం.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పురోభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయింపుల్లో కేంద్ర ప్రభుత్వం ఇతోధిక సహకారం అందిస్తోంది. జల్ జీవన్ మిషన్ పథకం పొడిగింపు ద్వారా మన రాష్ట్రానికి ఎంతో మేలు చేకూరుతుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇస్తూ మౌలిక వసతుల కల్పనకు తోడ్పాటు ఇస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని అన్నారు.

# పవన్ వ్యాఖ్యలతో పార్టీ కేడర్ లో అసహనం

**కాకినాడ, తెలంగాణ ముచ్చట్లు :**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా మారిపోయారంటున్నారు. ప్రశ్నించడం మానేసి ఫక్తు రాజకీయ నేత అవతారమెత్తారన్నది ఆ పార్టీనేతలతో పాటు సొంత సామాజికవర్గం నుంచి వినిపిస్తున్న మాటలు. గతంలో పదేళ్ల పాటు ప్రశ్నిస్తూ, ప్రభుత్వాన్ని ఎదరిస్తూ పాలిటిక్స్ లోనూ పవర్ స్టార్ గా చెలామణి అయిన పవన్ కల్యాణ్ గొంతు గత తొమ్మిది నెలల నుంచి పెగలకపోవడంపై సొంత పార్టీ క్యాడర్ అసహనం వ్యక్తంచేస్తుంది. ఎవరైనా పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రిగా చూడాలనుకున్నారు. లక్షలాది మంది ఆయన అభిమానులతో పాటు, కాపు సామాజికవర్గం కూడా పవన్ వల్లనే తొలిసారి తమకు ముఖ్యమంత్రి పదవి దక్కుతుందని ఆశించారు. కానీ పవన్ వ్యాఖ్యలు చూస్తుంటే అది నిజమయ్యేటట్లు కనిపించడం లేదంటున్నారు. మొన్న పదేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రి గా కొనసాగాలని ఆకాంక్షించిన పవన్ కల్యాణ్ తాజాగా మరో ఐదేళ్లు పెంచి పదిహేనేళ్ల వరకూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటుందని చెప్పారు. ఎన్ని లొసుగులు ఉన్నప్పటికీ తాము కలసే ఉంటామని చెప్పారు. జగన్ పై విమర్శలు చేసిన పవన్ కల్యాణ్ చంద్రబాబు పరిపాలన దక్షతను మరోసారి ప్రశంసించారు. గ్రూప్ 2 అభ్యర్థులకు జరిగిన అన్యాయం విషయంలో కానీ, మిర్చి రైతులకు సరైన గిట్టుబాటు ధరలు లేక ఆందోళన చెందుతున్నప్పటికీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా వదిలేయడాన్ని వేరేరకంగా అభిమానులు చూస్తున్నారు.పదేళ్లు తాము చూసిన పవన్ కల్యాణ్ వేరు. నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత చూస్తున్న ఆయన వేరు అన్నట్లుగా ఉందని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ప్రభుత్వం ఎన్ని తప్పులు చేస్తున్నా ప్రశ్నించకుండా ప్రశంసించడమేంటని జనసేన నేతలే అంటున్నారు. జగన్ ను ప్రజలు ఛీ కొట్టారు. ఆయనను అధికారానికి దూరంగా ఉంచారు. అలాంటి జగన్ ను విమర్శించి ఏమాత్రం ప్రయోజనం లేదు. అదే సమయంలో ప్రజాసమస్యలపై నిలదీసే తత్వాన్ని పవన్ కల్యాణ్ పూర్తిగా కోల్పోయారంటూ జనసేన పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. సనాతన ధర్మమంటూ తిరిగితే సరిపోతుందా? ప్రజా సమస్యలను పట్టించుకోవాల్సిన పనిలేదా? అని ఎదురు ప్రశ్నలు పవన్ కు ఎదురవుతున్నాయి.కూటమి ధర్మం కాబట్టి పవన్ కల్యాణ్ టీడీపీని ప్రశ్నించలేకపోవచ్చు. కానీ అదే సమయంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఆయన ప్రయత్నించడం ఎంత మాత్రం తప్పు కాదు. మిర్చి రైతుల ఆందోళన జరుగుతున్నప్పుడు మిర్చి యార్డుకు వెళ్లవచ్చు. అలాగే కొన్నినిర్ణయాలు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్నా, దానిని వెనకేసుకు రావడం ఏమాత్రం బాగాలేదని సొంత పార్టీ క్యాడర్ అంటుంది. ఇప్పటి వరకూ పవన్ కల్యాణ్ అధికారంలో లేరు కాబట్టి ఆయన ఏం మాట్లాడినా చెల్లింది. అధికారంలో లేనప్పుడు సుగాలి ప్రీతి హత్య వ్యవహారాన్ని పదే పదే ప్రస్తావించిన పవన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు అడగటం లేదని కూడా అంటున్నారు. అందుకే పవన్ కల్యాణ్ క్రమంగా పొలిటికల్ పరంగా ఇమేజ్ కోల్పోతున్నట్లే కనపడుతుంది. ఆయనలో ప్రశ్నించే తత్వం కనుమరుగై ప్రశంసించడమే పనిగా పెట్టుకోవడాన్ని కొందరు తప్పుపడుతున్నారు.

### ఆరు నెలల్లోనే ఫోరెన్సిక్ ల్యాబ్

# పనులు 90 శాతం పూర్తి

**గుంటూరు,తెలంగాణ ముచ్చట్లు న్యూస్ :**
రాజధాని అమరావతి నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. అమరావతికి కేంద్రం నుంచి సహకారం కూడా అందుతూ ఉండటంతో నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. అమరావతిలో వివిధ మౌలిక వసతుల నిర్మాణం కోసం ఇప్పటికే టెండర్లు కూడా ఆహ్వానించారు. త్వరలోనే వీటిని ఖరారు చేసి.. మార్చి 15 నుంచి పనులు ప్రారంభించనున్నారు. మరోవైపు అమరావతిలో మరో ప్రతిష్టా?త్మక నిర్మాణం వేగంగా రూపుదిద్దుకుంటోంది. అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఫోరెన్సిక్ ల్యాబ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని హోం మంత్రి వంగలపూడి అనిత ఎక్స్వేదికగా వెల్లడించారు.హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం.. ఏపీ ఫోరెన్సిక్ ల్యాబ్ డైరెక్టర్ జి.పాలరాజు.. వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమరావతిలోని తుళ్లూరులో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ కార్యాలయం నిర్మాణ పనుల పురోగతిని హోం మంత్రికి వివరించారు. ఆరు నెలల్లోనే ఫోరెన్సిక్ ల్యా?బ్ పనులు 90 శాతం పూర్తయ్యాయని.. ప్రయోగశాల పనులూ చురుగ్గా జరుగుతున్నాయని వివరించారు. ఈ విషయాన్ని హోం మంత్రి అనిత ఎక్స్ వేదికగా వెల్లడించారు. నేరస్థులను పట్టుకోవడంతో పాటుగా నేర నిరూపణలో శాస్త్రీయ ఆధారాల విశ్లేషణకు ఫోరెన్సిక్ ల్యాబ్ అనేది చాలా అవసరం. ఈ నేపథ్యంలోనే అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిర్మాణం ప్రారంభించారు. 2017 డిసెంబర్‌లో తుళ్లూరులో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో దీనికి శంకుస్థాపన చేశారు. రూ.400 కోట్ల అంచనాతో ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించడంతో అమరావతి ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిర్మాణం ఆగిపోయింది.2024 ఎన్నికల్లో విజయం అనంతరం టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ పనులను మళ్లీ ప్రారంభించారు. మొత్తం మూడు బ్లాకులలో ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం బ్లాక్ 1 నిర్మాణం పూర్తి కావొచ్చింది. రెండో బ్లాక్‌కు సంబంధించిన పిల్లర్ల పనులు జరుగుతున్నాయి. ఈ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీలో డీఎన్ఏ, నార్కోటిక్స్, బయోమెట్రిక్స్, సైబర్, బాలిస్టిక్స్, ఫోరెన్సిక్ అకౌంటింగ్‌కు సంబంధించిన ఎక్సలెన్స్ కేంద్రాలు, ట్రైనింగ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించా

# ప్రకాశం, పల్నాడులలో బయో గ్యాస్ ప్లాంట్లు



**గుంటూరు,తెలంగాణ ముచ్చట్లు న్యూస్ :**
ఆంధ్రప్రదేశ్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. తొలి దశలో భాగంగా పల్నాడు, ప్రకాశం జిల్లాలలో రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయ నున్నారు. ఈ నేపథ్యంలో ఏపీలో కంప్రెస్ట్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటు గురించి రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రతినిధులు మంగళవారం మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌తో చర్చించారు. సచివాల యంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఆర్ఐఎల్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కంప్రెస్ట్ బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటును వేగవంతం చేయాలని రిలయన్స్ ప్రతినిధులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. తొలి విడతలో భాగంగా ప్రకాశం, పల్నాడు జిల్లాల్లోని బంజరు భూముల్లో రిలయన్స్ కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివరించారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు కోసం కావాల్సిన భూమిని అందించాలని రెవెన్యూశాఖ మంత్రిని కోరినట్లు గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు రిలయన్స్ సంస్థ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. 65 వేల కోట్లు పెట్టుబడి పెట్టి 500 బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా రెండున్నర లక్షల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలి దశలో భాగంగా ప్రకాశం జిల్లా కనిగిరి, పల్నాడు జిల్లాలలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ ద్వారా ఈ ఇంటిగ్రేటెడ్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. కనిగిరిలో మొదటి ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. కనిగిరిలో రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాట కోసం 4000 ఎకరాల బంజరు భూమిని గుర్తించినట్లు తెలిసింది. ఈ నాలుగు వేల ఎకరాలను రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.బీడు భూములు అధికంగా ఉన్న నేపథ్యంలో కనిగిరి ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు సమాచారం.ఈ బంజరు భూముల్లో ఒక రకమైన గడ్డిని పెంచి.. ఆ గడ్డి ద్వారా బయో గ్యాస్ ఉత్పత్తి చేయనున్నారు. బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కోసం సేకరించనున్న నాలుగు వేల ఎకరాల భూమిలో.. ప్రభుత్వ భూమికి అయితే ఎకరాకు ఏడాదికి 15 వేలు, ప్రైవేట్ భూమికి అయితే ఎకరాకు ఏడాదికి రూ.30వేలు చొప్పున కౌలు చెల్లించనున్నట్లు సమాచారం. వీలైనంత త్వరగా రైతులతో మాట్లాడి కౌలు ఒప్పందాలు పూర్తి చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు.

# జనసేన గూటికి మాజీ మంత్రి..?

**ఒంగోలు, తెలంగాణ ముచ్చట్లు న్యూస్ :**
ఆ మాజీమంత్రి టీడీపీలో చేరేందుకు చేస్తున్న ప్రయత్నాలు బూమరాంగ్ అవుతున్నాయంట. పార్టీ మారాలని వైసీపీకి రాజీనామ చేసి నెలల గడుస్తున్నా టైమ్ కలసి రావటం లేదట. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఒకప్పుడు సన్నిహితుడిగా పేరున్న ఆ మాజీ మంత్రికి ఇప్పుడు చంద్రబాబు అపాయింట్‌మెంటే దొరకడం లేదంట. వైసీపీలోకి వెళ్లి తప్పు చేశాను.. తిరిగి సొంత గూటికి వచ్చేస్తానని అంటున్నా.. ఆయనకి చిన్న బాబు నో ఎంట్రీ బోర్డు పెట్టారంట. ప్రకాశం జిల్లాకు చెందిన మాజీమంత్రి శిద్దా రాఘవరావు.. బడా గ్రానైట్ వ్యాపారి.. కొద్ది నెలల క్రితం వైసీపీకి రాజీనామా చేశారు. 2014లో చంద్రబాబు కేబినెట్లో మంత్రిగా పనిచేసిన శిద్దా రాఘవరావు.. 2019లో ఒంగోలు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి తర్వాత ఆయన వ్యాపార అవసరాల కోసం వైసీపీ కండువా కప్పుకున్నారు. 2024 ఎన్నికల్లో దర్శి నియోజక వర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయాలని ఆయన భావించినా సాధ్యపడలేదు. వైసీపీ అధ్యక్షుడు జగన్ ఉమ్మడి ప్రకాశం లోని అద్దంకి, ఒంగోలు, మార్కాపురం స్థానాలలో ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయాలని సూచించినా ఆయన సుముఖత వ్యక్తం చేయలేదు.తెలుగుదేశం పార్టీ నుంచి రాజకీయ ఆరంగ్రేటం చేసిన శిద్దా రాఘవరావు 2004లో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తొలిసారి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం టీడీపీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.. 2014లో ప్రకాశం జిల్లా దర్శి నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఎమ్మెల్యేగా తొలిసారి విజయం సాధించి అప్పటి అధికార టీడీపీలో కీలక శాఖలకు మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికలలో కూడా ఆయన తిరిగి దర్శి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని భావించినా అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ తరపున ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో దిగాల్సి వచ్చింది. అయితే, ఆ ఎన్నికల్లో ఆయన అప్పటి వైసీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు.2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావటంతో కొంతకాలం తర్వాత అప్పటి ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీ ఓటమి తర్వాత ఆ పార్టీకి రాజీనామా చేసిన శిద్దా తాను ఏ పార్టీలో చేరాలనుకుంటున్నాననే విషయం మాత్రం ఇప్పటి వరకు ఎక్కడా ప్రకటించలేదు. అయితే విజయవాడ వరదల సమయంలో సీఎం చంద్రబాబును కలవడం రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. తన సోదరులతో వెళ్లి చంద్రబాబును కలిసిన శిద్దా.. వరద బాధితులకు విరాళం ఇచ్చారు. అయితే వైసీపీకి రాజీనామా చేసిన అనంతరం ఆయన చంద్రబాబును కలవాలని చూస్తున్నా అది సాధ్యపడటంలేదట.పార్టీ నుంచి తనకు ఎటువంటి పదవుల హామీలు లభించక పోయినా తాను మాత్రం టీడీపీలోకి తిరిగి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని శిద్దా రాఘవరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనర్ధన్ తో రాయబారం నడిపినా అధిష్టానం వైపు నుంచి గ్రీన్ సిగ్నెల్ రావడం లేదంట. అధినేత నుంచి క్లారిటీ రాక పోవటంతో టీడీపీలో చేరిక కోసం ఎదురు చూస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. శిద్దా టీడీపీలో చేరిక విషయంలో సీఎం చంద్రబాబు కొంత వరకు సానుకూలంగా ఉన్నప్పటికీ.. మంత్రి నారా లోకేష్ మాత్రం ఆయన రాకకు సుముఖత వ్యక్తం చేయటం లేదని తెలుస్తోంది.సీఎం చంద్రబాబుతో పాటు నారా లోకేష్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే శిద్దా టీడీపీ చేరికకు లైన్ క్లియర్ అవుతుందని పార్టీ లోని సీనియర్ నేతలు కూడా శిద్దా తేల్చి చెప్పారట. దీంతో ఆయన చేసేదేమీ లేక అవకాశం కోసం చూస్తూ ఉండి పోయారట. ఇప్పటకే ఒంగోలుకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి జనసేన పార్టీలో చేరారు. అప్పట్లో శిద్దా రాఘవరావుకి బాలినేని దగ్గర ఉండి వైసీపీ కండువ కప్పించారు. టీడీపీ నుంచి శిద్దాకి లైన్ క్లియర్ కాకపొతే మార్చి నెలలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి శిద్దాకు జనసేన కండువా కప్పించడానికి బాలినేని రూట్ క్లియర్ చేస్తున్నారంట. శిద్దా జనసేనలో జాయిన్ అయితే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పార్టీకి బలమైన ఆర్థిక అండ దొరకడంతో పాటు ఇటు పార్టి ఎదుగుదలకు ఉపయోగపడుతుందనేది బాలినేని ఆలోచనగా తెలుస్తుంది. చూడాలి మరి శిద్దా రాఘవరావు ఏ పార్టీ పంచకు చేరతారో?

# సేనాని ఈజ్ బ్యాక్



**అమరావతి, తెలంగాణముచ్చట్లు :**
పవన్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో.. పవన్ రంగంలోకి దిగితే ఎలా ఉంటుందో చెప్పడానికి.. అసెంబ్లీ సాక్ష్యంగా మారింది. ఒక్కో మాట.. ఒక్కో తూటాలా వినిపించింది. స్వరం మారేదే లేదు.. స్టాండ్‌లో మార్పు లేదు అన్నట్లుగా ఫ్యాన్ పార్టీని చెడుగుడు ఆడుకున్నారు పవన్. పొత్తుల నుంచి అసెంబ్లీలో వైసీపీ ఎత్తుల వరకు.. కొన్నింటికి క్లారిటీ, ఇంకొన్నింటికి తన మార్క్ వార్నింగ్ ఇచ్చారు. సేనాని ఈజ్ బ్యాక్ అనిపించారు.వైసీపీ, పవన్ యుద్ధం.. ఎప్పటికీ చల్లారనిది! అదే అనిపించింది అసెంబ్లీ సమావేశాల్లో డిప్యూటీ సీఎం మాటలు వింటే. నిజానికి ఎన్నికల ముందు ఫ్యాన్ పార్టీని పవన్.. అంశాలవారీగా చీల్చి చెండాడారు. డిప్యూటీ సీఎం అయ్యాక.. పాలనపై మీదే ఫోకస్ పెట్టి తన పని తాను చేసుకోపోతున్నారు. ఐతే వైసీపీ నుంచి మాత్రం విమర్శలు ఆగలేదు.కూటమిలో లుకలుకలు స్టార్ట్ అయ్యాయని.. పవన్ దూరం జరుగుతున్నారంటూ సోషల్‌మీడియా వేదికగా వైసీపీ ప్రచారం మొదలుపెట్టింది. ఐతే వాటిపై ఇన్నాళ్లు మౌనంగా ఉన్న పవన్.. అసెంబ్లీ సాక్షిగా విరుచుకుపడ్డారు. పాత పవన్‌ను గుర్తు చేశారు. అదే ఫైర్.. అదే దూకుడు.. తగ్గేదే లే, తగ్గింది లే అన్నట్లుగా పవన్ మాటలు వినిపించాయ్.అసెంబ్లీ సమావేశాల మొదటిరోజు 20 నిమిషాలు మాత్రమే సభకు హాజరైన వైసీపీ ఎమ్మెల్యేలు.. గందరగోళం క్రియేట్ చేశారు. స్పీకర్ పోడియం ఎదుట నిరసన తెలపడంతో పాటు.. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డగించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత సభ నుంచి వాకౌట్ చేశారు. సభలో జగన్ తీరుపై.. పవన్ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు.ప్రతిపక్ష హోదా రాదని ఫిక్స్ అవ్వాలంటూ చురకలు అంటించారు. దీనిపై వైసీపీ రియాక్ట్ అవగా.. శాసనసభ వేదికగా పవన్ ఫైర్ అయ్యారు. వైసీపీ సభ్యుల తీరు చూస్తే టెర్రరిజం గుర్తుకు వచ్చిందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పేరెత్తి చెప్పకపోయినా.. వైసీపీ ప్రతీ మాటకు కౌంటర్ ఇచ్చారు. పవన్ మాటలు.. ఫ్యాన్ పార్టీకి తగలాల్సినచోట తగినట్లు అనిపించాయ్.వైసీపీ చేసిన రచ్చకు తాను క్షమాపణ చెప్తున్నానంటూ.. ఫ్యాన్ పార్టీని దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు పవన్. ఇది రాజకీయంగా జనసేనకు కలిసివచ్చే అవకాశాలు లేకపోలేదు. కూటమి విషయంలో స్ట్రాంగ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. పదేళ్లు కూటమిగానే ఉంటాం.. అధికారం తమదే అన్న పవన్ ఇప్పుడు మరో ఐదేళ్లు పెంచారు.కూటమి ప్రభుత్వం 15ఏళ్లు కొనసాగుతుందని చెప్పారు. ఎవరెవరో ఏదేదో మాట్లాడుతున్నారని.. ఏదీ పట్టించుకోమని అన్నారు. కూటమిలో లుకలుకలు అంటూ వైసీపీ చేస్తున్న ప్రచారానికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎన్ని కష్టాలు వచ్చినా.. కలిసే ఉంటామని కూటమిని నిలబెడతామని హామీ ఇచ్చారు.వైసీపీ విషయంలో ఎప్పటికీ తగ్గేదే లే అన్నట్లు పవన్ మాటలు వినిపించాయ్. ఎన్నికల ప్రచారంలో వైసీపీని నిలదీసిన పవన్.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కూడా అదే కంటిన్యూ చేస్తున్నారు. ప్రజావేదికల కూల్చివేతల నుంచి.. అమరావతి రైతులపై దాడు, చంద్రబాబు జైలు, కల్తీ లడ్డూ వరకు ప్రతీ విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఫ్యాన్ పార్టీని ఓ ఆట ఆడుకున్నారు పవన్ కల్యాణ్.వైసీపీ విషయంలో ఏ విషయం మర్చిపోయేది లేదని.. అన్నింటినీ నిలదీస్తాం, కడిగేస్తాం అన్నట్లుగా కనిపిస్తున్నారు. రాజకీయ వైరం మాత్రమే కాదు.. అంతకుమించి అన్నట్లుగా వైసీపీ మీద పవన్ యుద్ధం చేస్తున్నారా అనిపిస్తోంది కొన్నిసార్లు ! చంద్రబాబు అయినా వైసీపీ విషయంలో అంతో ఇంతో మౌనం వహిస్తున్నారేమో కానీ.. పవన్ మాత్రం అలా కనిపించడం లేదు.

# మహిళలను వంచించిన కూటమి ప్రభుత్వం


**అమరావతి, తెలంగాణముచ్చట్లు :**
రాష్ట్ర బడ్జెట్ ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసింది. ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారు. గత బడ్జెట్ లోనూ దారుణంగా ప్రజలను మోసం చేశారు. పూర్తి స్థాయిలో ఈ బడ్జెట్ లో అయినా హమీల అమలుకు కేటాయింపులు చేస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూశారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులను మోసం చేశారు. ఇది పేదల వ్యతిరేక బడ్జెట్. మహిళలకు సూపర్ సిక్స్ లో పెద్దపీట వేస్తున్నామని హామీలు ఇచ్చారు. కానీ నేడు బడ్జెట్ లో వాటికి సంబంధించిన కేటాయింపులు కనిపించడం లేదు. మేనిఫేస్టోలో పెట్టిన ఏ అంశాన్ని అమలు చేసే పరిస్థితి లేదు. మహాశక్తి పథకంపై ఎంతో గొప్పగా చెప్పుకున్నారు. గత బడ్జెట్ లో మహాశక్తి పథకానికి నిధులు కేటాయించేశామంటూ హోంమంత్రి ఆర్భాటంగా సభలో మాట్లాడారు. గత బడ్జెట్ లోనూ, ఈ రోజు పూర్తిస్థాయి బడ్జెట్ లోనూ ఈ పథకానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. ఈ బడ్జెట్ లో దానికి సంబంధించిన ఊసే లేదు. తల్లికి వందనం, రైతుభరోసాకు అరకొర నిధులు కేటాయించారు. తల్లికి వందనం అమలుకు రూ.12,000 కోట్లు కావాలి. కానీ వారు తాజా బడ్జెట్ లో కేవలం 9,400 కోట్లు కేటాయించారు. జగన్ గారు సీఎంగా కొనసాగి ఉన్నట్లయితే గత ఏడాదితో పాటు ఈ ఏడాది కూడా ఈ పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు డబ్బు జమ అయ్యేది. కానీ గత ఏడాది తల్లికి వందనంను కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టింది. ఈ ఏడాది కూడా పూర్తి స్థాయిలో కాకుండా తక్కువగానే కేటాయింపులు చేశారు. గత ఏడాది ఆలస్యంగా పెట్టిన బడ్జెట్ లో తల్లికి వందనం కోసం రూ. 5,387 కోట్లు కేటాయించారు. ఆ నిధులు ఏమయ్యాయి? దీపం పథకంపై గత బడ్జెట్ సమావేశాల్లో చాలా గొప్పలు చెప్పారు. రాష్ట్రంలో దీపం పథకం కింద అర్హులైన లబ్ధిదారులు 1.55 కోట్ల మంది ఉంటే, వారిని 90 లక్షలకే కుదించారు. అంటే ఎంత దారుణంగా ప్రజలను మోసం చేశారో అర్థం చేసుకోవాలి. దీనికి గానూ రూ.4వేల కోట్లు అవసరం అయితే కేవలం రూ.2601 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ పథకానికి తూట్లు పొడిచారు. సున్నావడ్డీ కింద పదిలక్షల రూపాయల వరకు రుణాలు ఇస్తామన్నారు. ఈ బడ్జెట్ ను చూస్తే రాష్ట్ర పాలన తిరోగమనంలోకి వెడుతోంది. – సంక్షేమానికి కేటాయింపులు ఏవీ?: బొమ్మిా ఇజ్రాయేల్, ఎమ్మెల్సీఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలకు గానూ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఏ మేరకు కేటాయింపులు చేసిందో ఈ బడ్జెట్ లో స్పష్టత ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడి. ఆర్భాటంగా రూ.3.20 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వం అప్పులతో ముంచేసిందంటూ ఆరోపణల చేస్తున్నారు. ఈ బడ్జెట్ సమావేశాల నాటికే రూ.1.19 లక్షల కోట్లు అప్పులు చేశారు. వీటిని ఏ పథకానికి వినియోగించారు? ఎన్నికల్లో ప్రతి విద్యార్థికి రూ.15వేలచొప్పున తల్లికి వందనం ఇస్తామన్నారు. గత ఏడాది పూర్తిగా ఎగ్గొట్టారు.




# యూపీఐ లావాదేవీల రికార్డు

**బిజినెస్, తెలంగాణముచ్చట్లు :**
దేశవ్యాప్తంగా యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. జనవరి నెలలో 1,699 కోట్లకుపైగా లావాదేవీలు జరిగాయని, వీటి విలువ రూ.23.48 లక్షల కోట్లుగా ఉన్నదని ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఒక నెలలో ఇంతటి స్థాయిలో లావాదేవీలు జరగడం ఇదే తొలిసారని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,31,00 కోట్ల యూపీఐ లావాదేవీలు జరగగా, వీటి విలువ రూ.200 లక్షల కోట్లకు పైగా ఉన్నదని తెలిపింది. ప్రస్తుతం మార్కెట్లో 80 యూపీఐ యాప్స్, 641 బ్యాంకులు యూపీఐ ఎకోసిస్టాన్ని నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు జరిపేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని తెలిపింది.

# సెబీ కొత్త చీఫ్‌గా తుహిన్ కాంత పాండే నియామకం




**బిజినెస్, తెలంగాణముచ్చట్లు :**
స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' నూతన సారథిగా తుహిన్ కాంత పాండే నియమితులయ్యారు. స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' నూతన సారథిగాతుహిన్ కాంత పాండేనియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేస్తున్న ఆయనకు సెబీ చీఫ్ బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర నియామకాల కమిటీ గురువారం ఇందుకు ఆమోదం తెలిపింది. కాగా, ప్రస్తుతం సెబీ చీఫ్‌గా ఉన్న మాధాబీ పురీ బుచ్ మూడేళ్ల పదవీ కాలం నేటితో (ఫిబ్రవరి 28తో) ముగియనుంది. ఈ నేపథ్యంలో తుహిన్ కాంత పాండేను సెబీ కొత్త చీఫ్‌గా ప్రభుత్వం తుహిన్ కాంత పాండే 1987 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ అధికారి. ఆయన గతంలో ఆర్థిక కార్యదర్శిగా, రెవెన్యూ కార్యదర్శిగా పనిచేశారు. ఎయిరిండియా ప్రైవేటీకరణలో పాండే కీలక పాత్ర పోషించారు. తుహిన్ కాంత పాండేకు ఫైనాన్స్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌లో విస్తృత అనుభవం ఉంది. రానున్న మూడేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు.ఇక ఇప్పటి వరకూ సెబీకి చీఫ్‌గా వ్యవహరించిన మాధాబీ పూరీ బుచ్‌ను కేంద్రం 2022 ఫిబ్రవరి 28న నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆమె అదే ఏడాది మార్చి 2వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. సెబీకి ఓ మహిళ చైర్మన్‌గా నియామకం కావడం ఇదే తొలిసారి. మాధవి గతంలో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ హెడ్‌గా సేవలందించారు. 2017 నుంచి 2021 మధ్య కాలంలో సెబీ పూర్తి స్థాయి మెంబర్‌గా పని చేశారు. సెబీ చీఫ్‌గా ఆమె పదవీ కాలం నేటితో ముగియనుంది.

# బేర్ దెబ్బకు విలవిల

**బిజినెస్, తెలంగాణముచ్చట్లు :**
జీడీపీ గణాంకాలపై నెలకొన్న భయాలతో పాటు సుంకాలపై ట్రంప్ తాజా వ్యాఖ్యలు, అమెరికా ఆర్థిక వ్యవస్థలో మందగమనం శుక్రవారం ఈక్విటీ మార్కెట్లో మంటలు రేపాయి. భారీ స్థాయిలో జరిగిన అమ్మకాల ప్రభావంతో సెన్సెక్స్ 1,414.33 పాయింట్లు నష్టపోయి 73,198.10 వద్ద ముగిసింది. నిఫ్టీ 420.35 పాయింట్లు నష్టపోయి 22,124.70 వద్ద క్లోజైంది. ఫలితంగా బీఎసఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ (ఇన్వెస్టర్ల సంపద) ఒక్క రోజులోనే రూ.8.9 లక్షల కోట్ల మేరకు దిగజారి రూ.384.22 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. కీలక సూచీలన్నీ నష్టాల్లోనే ముగిశాయి. ఐటీ, ఆటో, బ్యాంక్, మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలన్నీ కూడా భారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అవి 0.7 శాతం నుంచి 6.5 శాతం మధ్యన నష్టపోయాయి.ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూల ధోరణులు దేశీయ మార్కెట్లో అమ్మకాలకు ఆజ్యం పోశాయి. ఏఐలో అగ్రగామిగా ఉన్న ఎన్‌విడియా షేర్లలో భారీ అమ్మకాలు దేశీయ ఐటీ షేర్లలో కూడా అమ్మకాలకు దారి తీశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 4.2 శాతం మేరకు నష్టపోయింది. టెక్ మహీంద్రా, విప్రో, ఎంఫసిస్ షేర్లు గరిష్ఠంగా 6.5 శాతం వరకు నష్టపోయాయి. ట్రంప్ చర్యల ప్రభావం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం కెనడా, మెక్సికోలపై 25% సుంకాలు విధించడంతో పాటు చైనాపై 10% అదనపు సుంకాలు విధిస్తూ తీసుకున్న చర్యలు శుక్రవారం మార్కెట్లో ప్రకంపనలు రేపాయి. ట్రంప్ వాణిజ్య విధానాలపై నెలకొన్న అనిశ్చితి మార్కెట్‌ను మరింత అస్థిరతకు గురి చేస్తోంది. వాణిజ్య యుద్ధం తీవ్ర రూపం దాల్చవచ్చన్న భయాల కారణంగా డాలర్ ఇండెక్స్ 107.36 పాయింట్లకు దూసుకుపోయింది. డాలర్ ఇండెక్స్ ఎంత బలపడితే భారత్ సహా వర్ధమాన మార్కెట్లకు అంత నష్టం అంటున్నారు.ఈక్విటీ మార్కెట్లలో బలహీనత కారణంగా అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి శుక్రవారం 19 పైసల మేరకు క్షీణించి 87.37 వద్ద ముగిసింది.

**ఏడాది కనిష్ఠానికి 148 స్టాక్స్**
శుక్రవారం నాటి బేర్ దెబ్బకు నిఫ్టీ 500 ఇండెక్స్‌లోని 140 స్టాక్స్ 52 వారాల కనిష్ఠానికి చేరాయి. ఈ షేర్లలో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆయిల్ ఇండియా, టాటా టెక్నాలజీస్, సొనాటా సాఫ్ట్‌వేర్ సహా మరికొన్ని ఉన్నాయి. మరోవైపు నిఫ్టీ 50లోని 45 షేర్లు నష్టాల్లోనే ముగిసాయి.

# విదేశీ విద్యార్థులకు చుక్కలు చూపిస్తున్న డాలర్..

**బిజినెస్, తెలంగాణముచ్చట్లు :**
ప్రస్తుతం అమెరికా, బ్రిటన్, కెనడా లాంటి దేశాలు వలస విధానాలను మరింత కఠినతరం చేస్తున్నాయి. బ్రిటన్‌లో విదేశీ విద్యార్థులు ఉన్నప్పటికీ, ఉద్యోగం పొందడానికి వారికి కనీసం 36,000-40,000 పౌండ్ల వార్షిక వేతనం ఉండాలి. కెనడా కూడా విద్యార్థుల కోసం వీసా విధానాల్లో మార్పులు చేస్తూ, కొన్ని ప్రత్యేక వీసా పథకాలను రద్దు చేసింది. దీంతో, చదువు తర్వాత అక్కడే ఉద్యోగం పొందాలనుకునే విద్యార్థులకు ఇది ఓ పెద్ద సవాలు అవుతోంది. విద్యార్థులు తీసుకునే విద్యా రుణాలపై కూడా రూపాయి బలహీనత ప్రభావం చూపుతోంది. హెచ్‌డిఎఫ్‌సి క్రెడిలా సహ వ్యవస్థాపకుడు అజయ్ బొహెరా ప్రకారం, రూపాయి పడిపోవడంతో విదేశాల్లో చదివే విద్యార్థుల రుణ భారం మరింత పెరిగింది. గతంలో విద్యార్థులు డాలర్లలో సంపాదించి రుణాన్ని తేలికగా చెల్లించగలిగేవారు. కానీ ఇప్పుడు జీవన ఖర్చులు పెరగడంతో పాటు, వీసా కఠినతరమైన కారణంగా ఉద్యోగ అవకాశాలు కూడా తగ్గిపోతున్నాయి. ముఖ్యంగా అమెరికాలో అండర్‌గ్రాడ్యుయేట్ చదివే విద్యార్థులకు ఇది మరింత సమస్యగా మారింది. రూ. 1.5 కోట్లకు పైగా



ఖర్చు పెట్టిన విద్యార్థులు, పని అనుమతులు తగ్గిపోవడం వల్ల, రుణాన్ని తిరిగి చెల్లించడానికి చాలా కాలం పడుతుంది. కేవలం విద్యార్థులే కాకుండా, విదేశీ పర్యాటక ప్రయాణాలపై కూడా ఈ మార్పులు ప్రభావం చూపిస్తున్నాయి. రూపాయి విలువ తగ్గడం, హోటల్ ఖర్చులు పెరగడం, ఎయిర్‌ఫేర్ రేట్లు అధికమవడం వంటి అంశాల వల్ల టూర్స్ ఖరీదైనవిగా మారాయి. ప్రతి వేసవి సీజన్‌లో 15-20% ఖర్చు పెరుగుతుందని టూర్ ఆపరేటర్లు చెబుతున్నారు. ముఖ్యంగా యూరోప్, ఆగ్నేయాసియా దేశాలకు వెళ్లే భారతీయ ప్రయాణికులు ఈ పెరుగుదల ప్రభావాన్ని ఎక్కువగా అనుభవిస్తున్నారు. ఇలా రూపాయి విలువ పడిపోవడం ఒకవైపు ఎన్‌ఆర్‌ఐలకు లాభదాయకంగా ఉంటే, మరోవైపు భారతీయ విద్యార్థులు, పర్యాటకులు, రుణగ్రహీతలు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. రూపాయి స్థిరపడే వరకు ఈ సమస్యలు కొనసాగే అవకాశం ఉంది.

# బంగారం ధరలు రోజూ ఒకేలా ఎందుకుండవు..!



**బిజినెస్, తెలంగాణముచ్చట్లు :**
రోజు మారిపోగానే బంగారం ధర కూడా మారిపోతూ ఉంటుంది. ఒక్కోసారి ఉన్నట్టుండి ఊహించనంత ఎక్కువగా పెరిగిపోతుంది. ఎందుకిలా జరుగుతుంది.. ఏ కారణాల వల్ల గోల్డ్ రేట్లు రోజుకో విధంగా ఉంటాయి.. బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడి అని ఎందుకంటారు.. వీటన్నింటికి కారణం ఈ 5 అంశాలే అంటున్నారు మార్కెట్ నిపుణులు.: బంగారం ధరలు రోజూ ఒకేలా ఎందుకుండవు.. ఈ 5 అంశాలే ప్రధాన కారణం..ప్రతిరోజూ బంగారం ధరలు చెక్ చేసుకునే అలవాటు చాలామందికి ఉంటుంది. కానీ, ఇలా గోల్డ్ రేట్లు రోజుకో విధంగా ఎందుకుంటాయని ఎప్పుడైనా ఆలోచించారా.. హఠాత్తుగా ఒక్కరోజులోనే అమాంతం ధర పైకి ఎగబాకటం.. ఇంకోరోజు తగ్గటం.. ఇలా బంగారం ధరల్లో ప్రతి రోజూ హెచ్చు తగ్గులు నమోదు కావడానికి కారణమేంటి.. మార్కెట్ పరిస్థితి ఎలా ఉన్నా బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా ఇన్వెస్టర్లు ఎందుకు భావిస్తారు. ఈ 5 అంశాలే అందుకు ప్రధాన కారణం.

1. అంతర్జాతీయ బంగారం ధరలు : భారతదేశంలో బంగారం ధరలను నిర్ణయించడంలో అంతర్జాతీయ బంగారం ధరలు గణనీయమైన పాత్ర పోషిస్తాయి. ఎందుకంటే, బంగారాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ ట్రేడ్ చేస్తారు. అందుకే ప్రపంచ మార్కెట్లలో జరిగే ప్రతి మార్పు ప్రభావం భారతీయ మార్కెట్లపైనా పడి బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తాయి.

2. రూపాయి-డాలర్ మారకం రేటు : అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ బంగారం ధరలను ప్రభావితం చేస్తుంది. బలహీనమైన రూపాయి బంగారం ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ముఖ్యంగా అమెరికా డాలర్ బలహీనపడితే వెంటనే ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడికి మొగ్గు చూపుతారు.

3. దిగుమతి సుంకం, పన్నులు : బంగారంపై దిగుమతి సుంకం, పన్నులలో మార్పులు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి. అధిక పన్నులు బంగారం ధరలు పెరగడానికి కారణమవుతాయి.

4. డిమాండ్, సరఫరా : పండుగలు, వివాహాల సమయంలో ఇండియాలో బంగారానికి డిమాండ్ ఎక్కువనే సంగతి తెలిసిందే. అందువల్లే ఈ సమయంలో గోల్డ్ రేట్లు అమాంతం పెరుగుతాయి. అలాగే తక్కువ డిమాండ్ ఉన్నప్పుడు ధరలు తగ్గడానికి ఆస్కారం ఉంటుంది.

5. భౌగోళిక రాజకీయ, ఆర్థిక అంశాలు : ప్రపంచ ఆర్థిక ధోరణులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకు విధానాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి. ఆర్థిక అనిశ్చితి తలెత్తిన సమయంలో బంగారాన్ని తరచుగా సురక్షితమైన ఆస్తిగా పరిగణిస్తాయి ప్రపంచదేశాలు

# డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చరికలు




**న్యూఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు న్యూస్ :**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చరికలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తలొగ్గినట్టే కనిపిస్తున్నది. తమ దేశ వస్తూత్పత్తులపై అధిక సుంకాలను వేస్తున్న దేశాలకు ప్రతీకార సుంకాలు తప్పవని అగ్రరాజ్య అధ్యక్షుడు ఈమధ్య కాలంలో పదేపదే చెప్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌కూ సుంకాల పోటు ఉంటుందని ఇటీవలి అమెరికా పర్యటనలో ప్రధాని మోదీకి ట్రంప్ నిర్మొహమాటంగా చెప్పిన సంగతీ విదితమే. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైనట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే అమెరికా నుంచి భారత్‌కు వస్తున్న వివిధ రకాల దిగుమతులపై ప్రస్తుతం విధిస్తున్న సుంకాలను తగ్గించేందుకున్న అవకాశాలను అన్వేషిస్తున్నట్టు సంబంధిత అధికార వర్గాలు చెప్తున్నాయి.కార్లు, మోటర్‌సైకిళ్లు తదితర ఆటోమొబైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, కీలక ఔషధాలు, కొన్ని వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్స్, విస్కీసహా మరికొన్నింటిపై వసూలు చేస్తున్న సుంకాలను తగ్గించే వీలుందంటున్నారు. తద్వారా అమెరికా అధిక సుంకాల నుంచి తప్పించుకోవచ్చన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తున్నారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం.. అమెరికా సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పటికే నిర్దేశించుకున్న సుంకాల కోత కంటే ఇంకా ఎక్కువగానే టారిఫ్‌లను తగ్గించాల్సి రావచ్చన్న అంచనాలను వారు వెలిబుచ్చు తుండటం గమనార్హం. దీంతో చాలారకాల వస్తు, సేవల దిగుమతులపై పెద్ద ఎత్తునే సుంకాలు తగ్గవచ్చని చెప్తున్నారు. ప్రస్తుతం అమెరికా సుంకాల హెచ్చరికలు.. యావత్తు ప్రపంచ వాణిజ్యాన్నే వణికిస్తున్నాయి. ఇప్పటికే స్టాక్, కరెన్సీ, కమోడిటీ మార్కెట్లపై ఆ ప్రభావం కనిపిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఆయా దేశాలతోపాటు భారత్ సైతం అమెరికాతో స్నేహపూర్వక వాతావరణానికి ప్రయత్నిస్తున్నది. ముఖ్యంగా చైనాతో వాణిజ్య యుద్ధానికి ట్రంప్ కాలుదువ్వుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న అవకాశాలను భారత్ అందిపుచ్చుకునేందుకు చొరవ చూపాలని మెజారిటీ ఆర్థిక నిపుణులు సలహా ఇస్తున్నారు. నిజానికి గ్లోబల్ మార్కెట్‌లో చైనాకు చెక్ పెట్టాలంటే భారత్‌ను ప్రోత్సహించడమే మార్గమని అమెరికా సైతం భావిస్తున్నది. దీంతో అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తున్నది. మరోవైపు భారత్‌కు రక్షణపరమైన ఎగుమతుల్ని పెంచాలని అమెరికా చూస్తున్నది. అయితే ఇప్పుడు రష్యా నుంచే ఎక్కువగా ఇక్కడికి వస్తున్నాయి. ఫలితంగా రష్యాతో సంబంధాలు చెడకుండా ట్రంప్ మెప్పును పొందే పనిలో మోదీ సర్కారున్నట్టు చెప్తున్నారు. ఇక 2030 నాటికి ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరాలని అటు అమెరికా, ఇటు భారత్ లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2023లో ఇది 127 బిలియన్ డాలర్లే.పొరుగు దేశాలైన మెక్సికో, కెనడాలపై టారిఫ్‌లను మంగళవారం నుంచి విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నట్టు సమాచారం. అలాగే చైనా నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం యూనివర్సల్ టారిఫ్‌ను రెట్టింపు చేయాలని కూడా చూస్తున్నట్టు తెలుస్తున్నది. కాగా, అమెరికాలోకి ఎంత మాత్రం ఉపేక్షించని విధంగా మనుషుల అక్రమ రవాణా, ఔషధాల స్మగ్లింగ్ జరుగుతున్నదని, వీటికి అడ్డుకట్ట వేసేందుకు అధిక సుంకాలు ఒక్కటే మార్గమని ట్రంప్ అనుకుంటున్నారు.





## ఖాన్‌తో గేమ్స్ ఆడొద్దు శాల్తీ లేచిపోతుంది..

తెలంగాణ ముచ్చట్లు న్యూస్ :

ఖాన్‌తో గేమ్స్ ఆడొద్దు శాల్తీ లేచిపోతుంది.. అంటూ హాస్యనటుడు డాక్టర్ కె.బ్రహ్మానందం విద్యార్థులను ఉత్సాహపరిచారు. వరంగల్ నిట్లో స్ప్రింగ్ స్ప్రి 2025 ప్రారంభించి మాట్లాడారు. చాలా పేదరికం నుంచి ఎన్నో అడ్డంకులు, అవహేళనలు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానన్నారు. లాల్ బహుదూర్ శాస్త్రి, డా. బీఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం ఎంతో కష్టపడి చదివారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. లెక్చరర్ గా చేసినప్పటికీ నాకంటూ గుర్తింపు తెచ్చుకోవాలని ఆలోచించగా సినిమాల్లో నటించే అవకాశం రాగా ఒక్కో అడుగు వేస్తూ ఒడిసి పట్టుకున్నానని తెలిపారు. నీ దగ్గర డబ్బు ఉంటేనే నీకు గౌరవం ఇస్తారు. కృషి, పట్టుదల సాధించాలనే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైఫ్ ఈజ్ ఏ గేమ్.. వి షుడ్ హావ్ టు ప్లే అంటూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. 40 ఏళ్ల సినీ పరిశ్రమలో 1200 పైగా చిత్రాల్లో నటించాను. ప్రపంచంలోనే అత్యధికంగా సినిమాలు తీసిన వ్యక్తి గా నిలిచిపోయానని పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు, డాక్టరేట్, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నాను. అందరూ బ్రహ్మ 'ఆనందంగా'ఉండాలి, మంచి ఆరోగ్యంతో మంచి ఆలోచనలు వస్తాయని విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు.

## నటుడిగా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న
# బాలీవుడ్ దర్శకుడు




తెలంగాణ ముచ్చట్లు న్యూస్ :

అడివిశేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం డెకాయిట్ ఈ సినిమాకు షానీల్ డియో కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. లవ్, రివేంజ్ డ్రామగా రాబోతున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ తాజాగా ఒక అప్‌డేట్ పంచుకున్నారు.ఈ సినిమాతో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా అనురాగ్ కశ్యప్ ఫస్ట్ లుక్ విడుదల చేసింది. ఈ ఫస్ట్ లుక్ గమనిస్తే.. అనురాగ్ ఇందులో స్వామిమాల ధరించిన పోలీస్ పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. తెలుగుతో పాటు హిందీలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అడివిశేష్ , మృణాల్ ఠాకూర్ మొదట ప్రేమికులుగా ఆ తర్వాత బద్ధ శత్రువులుగా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది.

# కీరవాణి కాన్సెర్ట్.. రాజమౌళి డిమాండ్

తెలంగాణ ముచ్చట్లు న్యూస్ :

'నా టూర్ ఎం.ఎం.కె' పేరిట ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి లైవ్ కాన్సర్ట్ చేయనున్నారు. మార్చి 22న సాయంత్రం 7గంటలకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఆ వేడుక ప్రారంభం కానుంది. సోషల్ మీడియా వేదికగా ఈ వివరాలు పంచుకుంటూ ఆయన సోదరుడు ఎస్ఎస్ రాజమౌళి () తన డిమాండ్ వినిపించారు. అభిమానులు సపోర్ట్ కోరారు. ఇంతకీ రాజమౌళి డిమాండ్ ఏంటంటే.. 'మార్చి 22 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఆ రోజు 'నా టూర్ ఎం.ఎం.కె' కాన్సర్ట్ ఉంది. అన్నయ్య సంగీతం అందించిన నా చిత్రాల్లోని పాటలు, వేరే సినిమాల్లోని పాటల ప్రదర్శనలుంటాయి. కానీ ఒరిజినల్ సౌండ్ ట్రాక్ ఉండాలనేది నా డిమాండ్. ఎందుకంటే ఆయన రీ



రికార్డింగ్ అద్భుతంగా ఉంటుంది. ఆయా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్లను ఆయన లైవ్‌లో ప్లే చేయాలని కోరుకుంటు న్నా. ఓఎస్‌టీ కావాలనే నాతో మీరూ జాయిన్ అవ్వండి" అని రాజమౌళి అభిమానులకు విజ్ఞప్తి చేశారు.

# 'హరిహర వీరమల్లు' అనుకున్న తేదీకే విడుదలైతే..



తెలంగాణ ముచ్చట్లు, సినిమా న్యూస్ :

మ్యాడ్ స్క్వేర్' సినిమాకు సంబంధించిన కార్యక్రమంలో నిర్మాత సూర్యదేవర నాగవంశీ. పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' అనుకున్న తేదీకే విడుదలైతే.. తాను నిర్మించిన 'మ్యాడ్ స్క్వేర్' మార్చి 29న రిలీజ్ కాదని నాగవంశీ స్పష్టం చేశారు. ఆయన మాటాడుతూ "28న హరిహర వీరమల్లు రిలీజ్ కానుంది. 29 మీకు కరెక్ట్ డేట్' అనుకుంటున్నారా?' అని ఓ విలేకరి ప్రశ్నించగా ప్రొడ్యూసర్ స్పందించారు. 'హరిహర వీరమల్లు' 28న వస్తుందో, లేదోనన్న విషయం సినిమా టీమ్‌ను అడగండి. ఒకవేళ ఆ చిత్రం వస్తుందని చెబితే.. మా సినిమా రాదు' అని అన్నారు. అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబోలో సినిమా ఈ నెలలో షూటింగ్ ప్రారంభం కానుందన్న రూమర్స్‌పై నాగవంశీ స్పందిస్తూ.. ఆ సినిమా ఇప్పుడే స్టార్ట్ కాదని, ఈ ఏడాది ద్వితీయార్థంలో మొదలవుతుందని తెలిపారు. అంతే కాదు డాకు మహారాజ్ చిత్రం కలెక్షన్లు తగ్గడానికి కారణం వివరించారు. ఆ సినిమాకు సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఎఫెక్ట్ పడింది. అయితే బాలకృష్ణ గారి వల్ల కొన్ని ఏరియాల్లో భారీ వసూళ్లు వచ్చాయి. రెండు సినిమాలకు ఆశించినంత వసూళ్లు రాలేదు. ఓటీటీలో మాత్రం ఆదరణ రెండు చిత్రాలకు బావుంది. సోలోగా సినిమాలు రావడం కష్టం" అని అన్నారు.

# ఇంటర్‌నేషనల్ రేంజ్‌కి అల్లు అర్జున్..

తెలంగాణ ముచ్చట్లు, సినిమా న్యూస్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం పుష్ప 2 ది రూల్ రేంజ్ ఇంటర్‌నేషనల్ వరకు వెళ్లింది. తాజాగా ఈ సినిమాలోని వచ్చుం డాయి ఫీలింగ్స్ పాటకు నేషనల్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్‌లో డ్యాన్స్ చేశారు. నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అనేది నార్త్ అమెరికాలో ఉన్న ప్రొఫెషనల్ బాస్కెట్‌బాల్ లీగ్. ఇందులో 30 జట్లు ఉంటాయి. ప్రపంచంలోని ప్రధాన ప్రొఫెషనల్ బాస్కెట్ బాల్ లీగ్‌లలో నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కూడా ఒకటి. ప్రస్తుతం ఈ టోర్నీకి సంబంధించి ఒక మ్యాచ్‌కి ముందు చీర్ గర్ల్స్ పుష్ప 2లోని వచ్చుండాయి ఫీలింగ్స్ పాటకు డ్యాన్స్ చేశారు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఇక ఈ వీడియో చూసిన అల్లు అర్జున్ అభిమానులు అల్లు అర్జున్ నేషనల్ కాకుండా ఇంటర్‌నేషనల్ వరకు వెళ్లిందని కామెంట్లు పెడుతున్నారు.



# ఇంగ్లండ్ కెప్టెన్సీకి బట్లర్ రాజీనామా



**తెలంగాణ ముచ్చట్లు, న్యూస్ :**
చాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లండ్ జట్టు దారుణ వైఫల్యంతో పరిమిత ఓవర్ల కెప్టెన్సీకి జోస్ బట్లర్ గుడ్‌బై చెప్పాడు. సారథ్యాన్ని వదులుకుంటున్నట్టు బట్లర్ శుక్రవారం ప్రకటించాడు. శనివారం దక్షిణాఫ్రికాతో జరిగే తమ చివరి గ్రూప్ మ్యాచే కెప్టెన్‌గా తనకు ఆఖరి దని తెలిపాడు. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా బుధవారం అఫ్ఘానిస్థాన్ చేతిలో ఓడడంతో ఇంగ్లండ్ జట్టు సెమీఫైనల్ ఆశలు ఆవిరయ్యాయి. సఫారీలతో శనివారం జరిగే పోరులో గెలిచినా ఇంగ్లండ్‌కు ప్రయోజనం లేదు. ఈ నేపథ్యంలో టోర్నీలో జట్టు పరాభవానికి నైతిక బాధ్యత వహిస్తూ కెప్టెన్సీ నుంచి బట్లర్ తప్పుకొన్నాడు. 'ఇంగ్లండ్ కెప్టెన్‌గా వైదొలుగుతున్నా. ఈ టోర్నీలో రెండు ఓటములతో సెమీస్‌కు దూరమయ్యాం. గత టోర్నీల పరాజయాలు కూడా నన్ను వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కెప్టెన్సీ నుంచి వైదొలగడమే మంచిది. ఇక, జట్టులో ఆటగాడిగా కొనసాగుతా' అని 34 ఏళ్ల బట్లర్ వెల్లడించాడు. 2022లో ఇయాన్ మోర్గాన్ నుంచి పరిమిత ఓవర్ల కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్న బట్లర్.. ఆ ఏడాది టీ20 ప్రపంచకప్‌లో జట్టును గెలిపించాడు. ఆ తర్వాత 2023 వన్డే ప్రపంచకప్‌తో పాటు గతేడాది టీ20 ప్రపంచకప్‌లో జట్టు విఫలమైంది. ఇటీవల భారత్‌తో సిరీస‌లోనూ ఇంగ్లండ్ చెత్తగా ఆడింది. వైస్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ జట్టు సారథిగా ఎంపికయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కాగా ఇంగ్లండ్ టెస్టు జట్టుకు బెన్‌స్టోక్స్ కెప్టెన్‌గా ఉన్న సంగతి తెలిసిందే.

# ఆస్ట్రేలియా జట్టు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది





**తెలంగాణ ముచ్చట్లు, న్యూస్ :**
చాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియా జట్టు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మ్యాచ్ కూడా వర్షం కారణంగా పూర్తిగా సాగకుండానే రద్దయ్యింది. దీంతో నాలుగు పాయింట్లతో గ్రూప్ 'బి' నుంచి కంగారూలు నాకౌట్‌లోకి అడుగుపెట్టారు. మరోవైపు మూడు పాయింట్లతో ఉన్న అఫ్ఘాన్ సాంకేతికంగా మాత్రమే రేసులో నిలిచింది. శనివారం జరిగే మ్యాచ్‌లో ఇంగ్లండ్ 207 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడిస్తే రన్‌రేట్ పరంగా అఫ్ఘాన్‌కు అవకాశం ఉంటుంది. పాక్‌లో వర్షం కారణంగా వరుసగా మూడో మ్యాచ్ రద్దు కావడం గమనార్హం. అయితే వరుణుడు అఫ్ఘాన్ ఇన్నింగ్స్‌కు ఆటంకం కలిగించలేదు. దీంతో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఈ జట్టు 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ గుర్బాజ్ తొలి ఓవర్‌లోనే డకౌట్ కాగా, చివరి మ్యాచ్‌లో శతక హీరో జద్రాన్ (22) త్వరగానే అవుటయ్యాడు. ఈ దశలో సెదిఖుల్లా (85) సంయమనం చూపాడు.

ముందుగా జద్రాన్‌తో కలిసి రెండో వికెట్‌కు 67, నాలుగో వికెట్‌కు హస్మతుల్లా (20)తో కలిసి 68 పరుగులు జత చేశాడు. అయితే సెంచరీకి చేరువలో సెదిఖు ల్లాను జాన్సన్ అవుట్ చేశాడు. ఆ తర్వాత అజ్మతుల్లా ఒమర్జాయ్ (67) బాధ్యత తీసుకున్నాడు. ఐదు సిక్సర్లతో చెలరేగిన అతడి ఆటతీరుతో అఫ్ఘాన్ స్కోరు 199/7 నుంచి 270 దాటగలిగింది. 12.5 ఓవర్ల ఆటే..: ఓ మాదిరి ఛేదనలో ఆసీస్ ఆట వర్షంతో కేవలం 12.5 ఓవర్ల పాటే సాగింది. కానీ ఓపెనర్ హెడ్ (59 నాటౌట్) దూకుడుతో అప్పటికే జట్టు వికెట్ నష్టానికి 109 పరుగులు చేసింది. వరుస ఫోర్లతో చెలరేగిన హెడ్ ఇన్నింగ్స్‌తో జట్టు పవర్‌ప్లేలోనే 90 పరుగులు సాధించింది. అటు 34 బంతుల్లోనే తన ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. అతడికి షార్ట్ (20), స్మిత్ (19నాటౌట్) సహకరించారు. మరోవైపు వీరి ఇన్నింగ్స్ 12.5 ఓవర్ల సమయంలో భారీ వర్షం కురవడంతో మ్యాచ్‌కు బ్రేక్ పడింది. గంటన్నర తర్వాత వర్షం తెరిపినిచ్చినా అవుట్ ఫీల్డ్ చిత్తడిగా మారింది. ఆటకు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

**అఫ్ఘానిస్థాన్:** 50 ఓవర్లలో 273 ఆలౌట్ (సెదిఖుల్లా 85, అజ్మతుల్లా 67, జద్రాన్ 22బీ ద్వార్షుస్ 3/47, జంపా 2/48, జాన్సన్ 2/49)బీ
**ఆస్ట్రేలియా:** 12.5 ఓవర్లలో 109/1. (హెడ్ 59 నాటౌట్, షార్ట్ 20, స్మిత్ 19 నాటౌట్‌బీ ఒమర్జాయ్ 1/43)
చాంపియన్స్ ట్రోఫీలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ (29 బంతుల్లో) సాధించడంతో పాటు పవర్‌ప్లేలో ఎక్కువ పరుగులు (90) సాధించిన జట్టుగా ఆసీస్.

# చరిత్రలో తొలిసారి ఫైనల్ ఆడుతున్న కేరళ..



**తెలంగాణ ముచ్చట్లు, న్యూస్ :**
సుదీర్ఘమైన చరిత్ర కలిగిన రంజీ ట్రోఫీ చరిత్రలో తొలిసారి ఫైనల్ ఆడుతున్న కేరళ.. విదర్భతో జరుగుతున్న టైటిల్ పోరులో పోరాడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భను 379 పరుగులకు ఆలౌట్ చేసిన కేరళ.. ఆ తర్వాత బ్యాటింగ్ చేస్తూ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 131 పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు ఇంకా 248 పరుగులు వెనుకబడి ఉంది. ఆదిత్య సర్వతె (66 నాటౌట్)తో పాటు కేరళ సారథి సచిన్ బేబీ (7 నాటౌట్) క్రీజులో ఉన్నారు. అహ్మద్ ఇమ్రాన్ (37)తో కలిసి మూడో వికెట్‌కు ఆదిత్య 93 పరుగులు జోడించి కేరళను ఆదుకున్నాడు. అంతకముందు 256/4 వద్ద రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన విదర్భ.. ఓవర్ నైట్ స్కోరుకు మరో 123 పరుగులు జతచేసి ఆలౌట్ అయింది. తొలిరోజు సెంచరీ హీరో డానిష్ (153) మరో 15 పరుగులు జోడించి ఔట్ అవగా లోయరార్డర్ బ్యాటర్లు క్రీజులో నిలవలేక పోయారు. మూడో రోజు కేరళ.. విదర్భ బౌలర్లను ఏ మేరకు అడ్డుకుంటుందనేదానిపై ఈ మ్యాచ్‌లో ఇరుజట్ల విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.



# ముంబై జోరుకు బ్రేక్

**తెలంగాణ ముచ్చట్లు, న్యూస్ :**
హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళుతున్న ముంబై ఇండియన్స్ మహిళల జట్టుకు బ్రేక్ పడింది. ఆల్‌రౌండ్ షో కనబర్చిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మెగ్ లానింగ్ (60 నాటౌట్), షఫాలీ (43) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగారు. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 123 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (22), హేలీ మాథ్యూస్ (22) మాత్రమే రాణించారు. స్పిన్నర్లు మిన్ను మణి (3/17), జొనాస్సెన్ (3/25) ధాటికి 23 రన్స్ వ్యవధిలోనే చివరి ఐదు వికెట్లు నేలకూలాయి. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో ఢిల్లీ 14.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 124 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు లానింగ్, షఫాలీ తుఫాన్ ఇన్నింగ్స్‌తో శుభారంభం అందించారు. నాలుగో ఓవర్‌లో 6,4,4తో 16 రన్స్ రాబట్టిన షఫాలీ.. తొమ్మిదో ఓవర్‌లో రెండు సిక్సర్లతో మరింత జోరు చూపింది. అయితే తొలి వికెట్‌కు 85 పరుగులు జత చేశాక అమన్‌జోత్‌కు చిక్కింది. ఆ తర్వాత లానింగ్ చెలరేగి అర్ధసెంచరీ పూర్తి చేసుకోవడంతో పాటు, మరో 33 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది.

**సంక్షిప్త స్కోర్లు:**
ముంబై ఇండియన్స్: 20 ఓవర్లలో 123/9 (హర్మన్‌ప్రీత్ 22, మాథ్యూస్ 22, బ్రంట్ 18, అమన్‌జోత్ 17 నాటౌట్‌బీ మిన్ను మణి 3/17జొనాసెన్ 3/25).
గుజరాత్ గెలుపు బాట వరుసగా రెండు ఓటముల తర్వాత మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్‌లో గుజరాత్ జెయింట్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. గురువారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్.. 6 వికెట్ల తేడాతో నెగ్గింది.

# గుజరాత్ గెలుపు బాట



**తెలంగాణ ముచ్చట్లు, న్యూస్ :**
బెంగళూరు: వరుసగా రెండు ఓటముల తర్వాత మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్‌లో గుజరాత్ జెయింట్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. గురువారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్.. 6 వికెట్ల తేడాతో నెగ్గింది. బంతితో సమిష్టిగా రాణించిన గుజరాత్.. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీని నిర్ణీత 20 ఓవర్లలో 125/7 కే కట్టడిచేసింది. కనిక అహుజా (28 బంతుల్లో 33, 1 ఫోర్, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా రఘ్వి బిస్త్ (22), జార్జియా వర్హెమ్ (20 నాటౌట్) ఆర్‌సీబీ గౌరవప్రదమైన స్కోరు చేసేందుకు సాయపడ్డారు. గుజరాత్ బౌలర్లలో తనూజా కన్వర్ (2/16), డియాంద్ర డాటిన్ (2/31), కాశ్వీ గౌతమ్ (1/17) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఈ సీజన్‌లో దూకుడుమీదున్న బెంగళూరు స్టార్ బ్యాటర్ ఎలీస్ పెర్రీ డకౌట్ అయింది. డబ్ల్యూపీఎల్‌లో 22 ఇన్నింగ్స్‌లు ఆడిన ఆమెకు డకౌట్ అవడం ఇదే ప్రథమం. జెయింట్స్.. 16.3 ఓవర్లలోనాలుగు వికెట్లు కోల్పోయి ఛేదనను పూర్తిచేసింది. మూనీ (17), డియోల్ (5) నిరాశపరిచినా ఆ జట్టు సారథి ఆష్లీ గార్డ్‌నర్ (31 బంతుల్లో 58, 6 ఫోర్లు, 3 సిక్సర్లు) మరోసారి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో గుజరాత్‌ను విజయపథాన నిలిపింది. లిచ్‌ఫీల్డ్ (30 నాటౌట్) ఆమెకు అండగా నిలిచింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన బెంగళూరుకు ఆడిన ఐదు మ్యాచ్‌లలో ఇది వరుసగా మూడో ఓటమి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala, Dharmasag Hanmakonda, 506151.Editor:BOLLEPAKA RAJESH. RNI:TELTEL/2013/ 88710. Contact: 9493669669. Email: telanganamuchatlu.in@gmail.com.Website : www.telanganamuchatlu.in